


వీహెచ్‌ఏల్లో అంతర్మథనం



- క్లస్టర్ విభజనతో అయోమయం
- సచివాలయ పనులు చేయలేమంటూ ఆందోళన
- గత ప్రభుత్వ నిర్ణయాలే శాపమని ఆవేదన
- ఉద్యాన శాఖలోనే పనిచేస్తామంటూ వినతి

ఒకే ఉద్యోగం.. బాధ్యతలు మాత్రం మూడు.. ఓ వైపు సచివాలయ విధులు.. మరో వైపు వ్యవసాయ పనులు.. ఉద్యానశాఖ బాధ్యతలతో సతమతమవుతున్నామంటూ గ్రామీణ ఉద్యాన సహాయకులు(వీహెచ్‌ఏలు) ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు కొన్ని బాధ్యతల నుంచి విముక్తి కలిగించాలని, వ్యవసాయ శాఖ నుంచి తొలగించి మాతృశాఖ అయిన ఉద్యాన శాఖలోనే కొనసాగించాలంటూ నిరసన బాట పట్టారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని ఉద్యాన శాఖ అధికారికి సైతం వినతిపత్రం అందజేశారు.

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతు సేవాకేంద్రాల రేషనలైజేషన్‌తో గ్రామీణ ఉద్యాన సహాయకుల్లో అంతర్మథనం మొదలైంది. రైతులకు మరి న్ని సేవలందించేందుకు కూటమి ప్రభుత్వం రైతుసేవాకేంద్రాల్లో పనిచేసే సిబ్బందిని రేషనలైజేషన్ చేపట్టి ప్రతిఉద్యోగి రైతుకు మరింత దగ్గర కావాలనే కసరత్తు జరుగుతోంది. రైతు సేవాకేంద్రాల్లో సిబ్బందిని మార్చడంతో పాటు అదనంగా ఉన్నవారిని వేరే ఇతర వ్యవసాయ కార్యకలాపాలకు ఉపయోగించుకునేందుకు ప్రభుత్వం ముం దుకెళుతోంది. అటు సచివాలయ పనులను, ఇటు వ్యవసాయ పనులు, మరోవైపు ఉద్యానశాఖ పనులతో సతమతమవుతున్న వీహెచ్‌ఏ (విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్) తమకు కస్టర్ల విభజనతో తీవ్ర అన్యాయం జరిగే అవకాశముందనే ఆందోళనతో జిల్లా ఉద్యానశాఖ కార్యాలయానికి కదిలారు. వ్యవసాయ శాఖ నుంచి విముక్తి కల్పించి మాతృశాఖ అయిన ఉద్యానశాఖలో విలీనం చేస్తూ ఉద్యాన అధికారుల నియంత్రణలో పని చేసేలా అవకాశం కల్పించాలని కోరుతూ సోమవారం జిల్లాలోని గ్రామీణ ఉద్యాన సహాయకులు(వీహెచ్‌ఏలు) జిల్లా ఉద్యానశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు.



విధుల్లో గ్రామీణ ఉద్యాన సహాయకులు



జిల్లా ఉద్యానశాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్‌ఏలు (ఫైల్)

పూర్తి ప్రక్షాళనకు..

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఉద్యాన పంటలు అత్యధికంగా ఉన్నచోట హార్టికల్చర్ అసిస్టెంట్‌ను, సెరీకల్చర్ ఎక్కువగా ఉన్న చోట సెరీకల్చర్ అసిస్టెంట్‌ను వేయాలి. గత ప్రభుత్వంలో ఇష్టానుసారంగా పంటలతో నిమిత్తం లేకుండా సిబ్బందిని కేటాయించారు. అగ్రికల్చర్ ఎక్కువగా ఉన్నచోట హార్టికల్చర్ అసిస్టెంట్‌ను, హార్టికల్చర్ ఎక్కువగా ఉన్నచోట అగ్రికల్చర్ అసిస్టెంట్‌లను నియమించడంతో పారదర్శకత లోపించింది. దీంతో ప్రభుత్వం పూర్తి ప్రక్షాళనకు పూనుకుంది. సాగుకు అనుగుణంగా రెండు రైతు సేవాకేంద్రాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటుచేయడానికి అధికారులు కసరత్తు ప్రారంభించారు. అందులో మండల స్థాయిలో ఇద్దరిని కాని, క్లస్టర్ స్థాయిలో ఒక సహాయకుడి గాని నియమించేందుకు సన్నద్ధమవుతున్నారు.

217 క్లస్టర్లుగా ఏర్పాటు

నంద్యాల జిల్లాలో 411 రైతు సేవాకేంద్రాలు ఉండగా రెండు లక్షల హెక్టార్లలో వ్యవసాయ భూములుండగా, 40వేల హెక్టార్లలో ఉద్యాన సాగు భూములున్నాయి. 101 మంది హార్టికల్చర్ అసిస్టెంట్‌లు, 310మంది అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు పనిచేస్తున్నారు. రేషనలైజేషన్‌లో భాగంగా 411 రైతుసేవాకేంద్రాలను 217 క్లస్టర్‌లుగా ఏర్పాటు చేస్తున్నారు. క్లస్టర్‌కు ఒక వీఏఏ కాని, ఒక వీహెచ్‌ఏ కాని నియమించాలని అధికారులు భావిస్తున్నారు. అందులో గ్రామీణ వ్యవసాయ సహాయకులే అధికంగా ఉండడంతో 217 క్లస్టర్‌లో అధికంగా వారినే తీసుకునే అవకాశం ఉందని, హార్టికల్చర్ క్లస్టర్‌లు తక్కువగా ఉండడంతో తాము తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని వీహెచ్‌ఏలో ఆందోళన మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలియజేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వినతిపత్రాలను అందజేస్తున్నారు. ప్రతి క్లస్టర్‌లో ఒక గ్రామీణ వ్యవసాయ సహాయకున్ని, ఒక ఉద్యాన సహాయకున్ని నియమించాలని కోరుతున్నారు.

పనిభారం పెరుగుతుంది



క్లస్టర్‌ల విభజన వల్ల ఇద్దరు పని చేయాల్సిన చోట ఒకరిని నియమించడం వల్ల పని భారం పెరుగుతుంది. అనేక మంది వ్యవసాయ సహాయకులు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం ఇలాంటి ఆలోచనలను విరమించి రైతులకు మరిన్ని సేవలందించేందుకు ఖాళీలుగా ఉన్న సహాయకుల పోస్టులను భర్తీ చేయాలి.

- సోమన్న, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ఆర్‌ఎస్‌కేలను కొనసాగించాలి



రైతు సేవా కేంద్రాలను యథావిధిగా కొనసాగించాలి. క్లస్టర్‌లుగా విభజించడం వల్ల రైతులకు ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఒక గ్రామం నుంచి దూరంగా ఉన్న మరో గ్రామానికి వెళ్లాలంటే రైతులు అవస్థలు పడుతారు. అలాగే కింది స్థాయి ఉద్యోగులకు అభద్రతా భావం ఏర్పడుతుంది.

- రాధాకృష్ణ, ఏపీ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వ ఆదేశాల మేరకే నిర్ణయం తీసుకుంటాం

ఉద్యాన పంటలు ఎక్కువగా ఉన్నచోట హార్టికల్చర్ అసిస్టెంట్‌ను, ఇతర చోట వ్యవసాయ సహాయకులను నియమించాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటాం. ఎవ్వరికీ ఎలాంటి అభద్రతాభావం ఉండనవసరం లేదు.

మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి



బసవేశ్వరుడి బోధనలు స్ఫూర్తిదాయకం: కలెక్టర్



బసవేశ్వర చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బసవేశ్వరుడి బోధనలు నేటికీ స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన మార్గంలో అందరూ సమాజశ్రేయస్సుకు కృషి చేయాలని కలెక్టర్ రాజకుమారి పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మహాత్మా బసవేశ్వర 892వ జయంతిని జిల్లా యువజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కలెక్టర్ రాజకుమారి, డీఆర్వో రామునాయక్, జిల్లా పర్యాటక అధికారి సత్యనారాయణమూర్తి, వీరశైవసంఘం నాయకులు పాల్గొని బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బసవేశ్వరుడు ప్రపంచ మానవులకు అవసరమైన బోధనలు చేశారని అన్నారు. వీరశైవ సంఘం నాయకులు కలెక్టర్‌ను శాలువా, మెమెంటోతో సన్మానించారు.

అభ్యంతరాలుంటే తెలపండి

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో ఖాళీగాఉన్న పోస్టులకు మార్చి 15వ తేదీన నోటిఫికేషన్ జారీ చేశామని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ అభ్యంతరాలను మే 1వ తేదీ ఉదయం 11నుంచి 3వ తేదీ సాయంత్రం 5గంటలలోపు తెలియజేయాలని ఐసీడీఎస్ జిల్లా పీడీ లీలావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల జిల్లా వెబ్‌సైట్‌లో ఎలిజిబుల్, నాన్ ఎలిజిబుల్ లిస్టులను ప్రదర్శించామని, వెబ్‌సైట్‌లో ప్రదర్శించిన లిస్ట్‌లో అభ్యంతరాలుంటే అభ్యర్థులు రాతపూర్వకంగా తగిన ధ్రువీకరణ పత్రాలతో ఐసీడీఎస్ కార్యాలయంలో సమర్పించాలని ఆమె కోరారు.

జిల్లా పంచాయతీ అధికారిగా శివారెడ్డి

నంద్యాల రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పంచాయతీ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు నంద్యాల డీఎల్‌డీవో శివారెడ్డికి అప్పగిస్తూ కలెక్టర్ రాజ కుమారి గణియా ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు బుధవారం ఆయన పూర్తి అదనపు బాధ్యతలను చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన డీపీవో జమీవుల్లా పదవీ విరమణ చెందడంతో ఆయన స్థానంలో శివారెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

కార్మిక పోరాట దినం

- కనుమరుగవుతున్న 8 గంటల పని విధానం
- నేడు మే డే



కర్నూలు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): చికాగోలో కార్మికుల రక్తతర్పణతో 8 గంటల పని విధానం సాధించి నేటితో 139 ఏళ్లు. 1886 మే 1న 8 గంటల రిక్రియేషన్ విధానం అమలులోకి రావడంతో నాటి నుంచి ఏటా మే ఒకటో తారీఖున 'ప్రపంచ కార్మిక దినోత్సవం' జరుపుకుంటారు. అయితే కాలక్రమేణా ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. కార్మిక చట్టాలను కాపాడుకోడానికి పోరాడే దీక్షా దినమే మేడే.

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో లక్షలాది మంది కార్మికులు పని చేస్తున్నారు. మోటర్, అనుబంధ రంగాల్లో 35 వేల మంది, భవన నిర్మాణ రంగంలో 2.50 లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారు. మరో లక్ష మందికిపైగా అసంఘటిత కార్మికులు ఉన్నారని కార్మిక శాఖ అధికారులు పేర్కొంటున్నారు. వీరికి ప్రభుత్వ పరంగా అందాల్సిన సంక్షేమ పథకాలు ఫలాలు అందడం లేదు. గతంలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్ ప్రాంతాల్లో పేపర్ మిల్లు, స్పిన్నింగ్ (నూలు) మిల్లులు, నూనే మిల్లులు, జిన్నింగ్ మిల్లులు, సున్నపు పరిశ్రమ, గ్రానైట్, నాపరాతి పరిశ్రమలు.. ఇలా వివిధ పరిశ్రమల్లో లక్షలాది మంది కార్మికులు పని చేసేవారు. పారిశ్రామిక రంగంలో వచ్చిన మార్పుల వల్ల ఈ పరిశ్రమలు దెబ్బతినిపోయాయి.

- **కనుమరుగు అవుతున్న కార్మిక చట్టాలు:**

దేశవ్యాప్తంగా కార్మికోద్యమాలు బలహీనపడటంతో 8 గంటల పని విధానం స్థానంలో 12 గంటల పని విధానం వచ్చింది.

మిగతా 6వ పేజీలో..

కార్మికులకు మెరుగైన పథకాలు

- లేబర్ కమిషనర్ బషీరున్నీసా బేగం

నంద్యాల టౌన్ ఏప్రిల్, 30 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు త్వరలో కేంద్ర ప్రభుత్వం నుంచి మంచి పథకాలు రానున్నట్లు జిల్లా లేబర్ కమిషనర్ బషీరున్నీసా బేగం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో బిల్డింగ్ తదితర నిర్మాణ రంగంలోని కార్మికులు 80 వేల మంది ఉన్నారని అన్నారు. ఈశ్రమ్ ద్వారా 3,31,000 మంది కార్మికులు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. వీరందరికి త్వరలో మంచి పథకాలు వస్తున్నట్లు తెలిపారు. 2002 నుంచి చాలా పథకాలు ప్రభుత్వం నిలుపుదల చేసినట్లు తెలిపారు. మే డే సందర్భంగా కార్మికులకు సమావేశం నిర్వహించి చట్టాలను, హక్కులను వివరిస్తామన్నారు.

స్పెషల్ సబ్ జైలు తనిఖీ

- ఖైదీల ఆరోగ్యం గురించి తీసుకుంటున్న చర్యలను పరిశీలించిన న్యాయమూర్తి



ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

నంద్యాల క్రైం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నంద్యాల స్పెషల్ సబ్ జైలును కర్నూలు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి లీలా వెంకట శేషాద్రి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి జైలు లీగల్ ఎయిడ్ క్లీనిక్‌ను తనిఖీ చేశారు. జైలులోని పలు విభాగాలను పరిశీలించారు. ఖైదీలకు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లీనిక్ గురించి వివరించారు. ఇందులో ఒక అడ్వకేట్, ఒక పారాలీగల్ వలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు న్యాయసలహాలు అందిస్తారని చెప్పారు. ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్షను పూర్తిచేసుకోవాలని సూచించారు. న్యాయవాదులు లేని ఖైదీలకు ఉచితంగా నియమిస్తామని తెలిపారు. 70ఏళ్ల పైబడిన ఖైదీలకు, అనారోగ్యంతో బాధపడేవారికి బెయిల్ మంజూరయ్యేలా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ గురుప్రసాద్‌రెడ్డి, జిల్లా జైళ్ల అధికారి నరసింహారెడ్డి, జైలు డాక్టర్ గురుకుమార్, లాయర్ బాలునాయక్ పాల్గొన్నారు.

బ్లడ్‌బ్యాంక్‌లో ఫ్రిజ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి



రక్త నిల్వ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్


నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న రక్త నిల్వ కేంద్రాన్ని బుధవారం సాయంత్రం కలెక్టర్ జి. రాజకుమారి పరిశీలించారు. నంద్యాల పట్టణంలోని కేసీకెనాల్ కార్యాలయం ఆఫీస్‌లో మైనర్ ఇరిగేషన్ కార్యాలయంలో రక్తనిల్వ కేంద్రం ఏర్పాటు కోసం పునరుద్ధరించిన భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నంద్యాల జిల్లా కేంద్రంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్త నిల్వ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు మంజూరుచేసిందన్నారు. రక్తనిల్వ కేంద్రానికి సంబంధించిన భవనాన్ని పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ వైస్‌చైర్మన్ మారుతీకుమార్, కోశాధికారి నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

సర్వత్రా ఉత్కంఠ

- 8న మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం..?
- వీగిపోయేలా పావులు కదుపుతున్న చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి
- అవిశ్వాసం నెగ్గితే చైర్మన్ రేసులో జాకీర్ హుస్సేన్
- వైస్ చైర్మన్ మద్దతు ఎవరికో..?



మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి



మొల్ల జాకీర్ హుస్సేన్, 2వ వార్డు కౌన్సిలర్

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాల్టీలో ఒక రకమైన సమస్య ఉంటే.. నందికొట్కూరు మున్సిపాల్టీ భిన్నమైన పరిస్థితుల్లో ఉంది. వైసీపీకి చెందిన చైర్మన్లను గద్దె దింపేందుకు మిగిలిన చోట్ల ప్రయత్నాలు సాగుతున్నాయి. అందుకు భిన్నంగా టీడీపీ లోనే రెండు వర్గాలుగా విడిపోయి అవిశ్వాసానికి తెరలేపారు. ఒక వర్గం బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డిది కాగా మరోవర్గం మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్యది. ఎంపీ బైరెడ్డి వర్గానికి చెందిన ప్రస్తుతం దాసి సుధాకర్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. జాకీర్ హుస్సేన్ చైర్మన్ పదవి ఆశించి భంగపడ్డారు. నామమాత్రంగా ఆయన తమ్ముడు రబ్బానీకి వైస్ చైర్మన్ పదవిని అప్పట్లో కట్టబెట్టారు. దీంతో చైర్మన్ సుధాకర్‌రెడ్డి, జాకీర్ హుస్సేన్‌ల మధ్య దూరం పెరిగింది. 2024 ఎన్నికలకు ముందు జాకీర్ హుస్సేన్ టీడీపీలో చేరి పార్టీ విజయానికి కృషిచేశారు. ఎమ్మెల్యే వర్గానికి చెందిన జాకీర్ హుస్సేన్ చైర్మన్‌పై అవిశ్వాసానికి తెరలేపారు.

నందికొట్కూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాల్టీలో చైర్మన్ అవిశ్వాసంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. టీడీపీలోనే రెండు వర్గాలుగా విడిపోయి అవిశ్వాసానికి తెరలేపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వైసీపీ నుంచి రెండు వర్గాలుగా విడిపోయి టీడీపీలో చేరారు. ఒకవర్గం బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరితే మరో వర్గం మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య వర్గంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే వర్గం చైర్మన్‌పై అవిశ్వాసానికి తెరలేపారు. ప్రతి నెలా జరగాల్సిన కౌన్సిల్ సమావేశాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చైర్మన్ నెలమరిచి నెల నిర్వహిస్తూ వచ్చారు. ఈసారి ఏకంగా మూడో నెలల తర్వాత సమావేశం నిర్వహించారు. 2024 ఎన్నికల ముందు టీడీపీలో చేరిన జాకీర్ హుస్సేన్ వర్గం అవిశ్వాసాన్ని నెగ్గించుకునేందుకు వ్యూహాలు రచిస్తుండగా.. ఒక వేళ అవిశ్వాసం పెడితే వీగిపోయేందుకు నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి వర్గంలో ఉన్న చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి ప్రతివ్యూహాలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. తానుకూడా టీడీపీలోనే ఉన్నాను కదా ఎలా అవిశ్వాసం పెడతారంటూ చైర్మన్ కూడా అధిష్టానం పెద్దల ముందు మొరపెట్టుకున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం ఇటు ఎమ్మెల్యే అటు ఎంపీలకు సవాల్‌గా మారిందని టీడీపీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మున్సిపల్ వైస్‌చైర్మన్ రబ్బాని, ఆయన సోదరుడు కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్ 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు నందికొట్కూరు పటేల్ సెంటర్ సాక్షిగా నారా చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీ విజయం కోసం వంతుగా కృషిచేశారు. ఎన్నికల ఫలితాల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీకి చెందిన నలుగురు కౌన్సిలర్లు మినహా మిగిలిన వారంతా రెండు వర్గాలుగా విడిపోయి బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో కొందరు, మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సమక్షంలో మరికొందరు టీడీపీలో చేరారు. మొదట 16మంది కౌన్సిలర్లతో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో చేరిన వారిలో చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి తీరు నచ్చక నలుగురు కౌన్సిలర్లతో పాటు వైసీపీకి చెందిన కౌన్సిలర్లు మొత్తం 12మంది కౌన్సిలర్లు మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే జయసూర్య ఆధ్వ ర్యంలో టీడీపీలో చేరారు. ప్రస్తుతం చైర్మన్‌తో సహా 10మంది కౌన్సిలర్లు ఎంపీ వర్గం లో ఉండగా, 15మంది కౌన్సిలర్లు మాండ్ర వర్గంలో ఉన్నారు.

వైసీపీకి చెందిన వారు మద్దతు ఎవరికో?

వైస్‌చైర్మన్ ప్రశాంతితో పాటు మరో ముగ్గురు కౌన్సిలర్లు వైసీపీలోనే ఉన్నారు. వైస్ చైర్మన్ ప్రశాంతి భర్త రామకృష్ణ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో నాడు టీడీపీలో చేరారు. కానీ ఆతర్వాత నుంచి ఆయన ఎలాంటి రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొన్న దాఖలాలు లేవు. వైస్‌చైర్మన్ ప్రశాంతి జనవరి నెలలో జరిగిన కౌన్సిల్ సమావేశం నిర్వహించేందుకు ఎమ్మెల్యే వర్గానికి మద్దతు తెలిపారు. దీంతో ఆమె ప్రస్తుతానికి వైసీపీలోనే ఉన్నా ఎమ్మెల్యే వర్గానికి మద్దతు తెలుపుతారన్న చర్చ జరుగుతోంది. వైసీపీకి చెందిన ఈ ముగ్గురు ఎవరికి మద్దతు తెలుపుతారన్నది వేచి చూడాలి. వైసీపీలో ఉన్న కౌన్సిలర్లతో పాటు తమ తమవర్గాల్లోని కౌన్సిలర్లను కూడా తమ వైపు తిప్పుకునేందుకు అటు ఎమ్మెల్యే వర్గం, ఇటు ఎంపీ వర్గం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే ఫలితం కూడా తారుమారు అయ్యే అవకాశాలు లేకపోలేదన్న వాదనలు వినిపిస్తున్నా యి.

సుధాకర్‌రెడ్డిని చైర్మన్ పదవి నుంచి..

మార్చి 17వ తేదీతో ప్రస్తుతం ఉన్న కౌన్సిల్ బాడీకి నాలుగు సంవత్సరాలు పూర్తి అయ్యింది. నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డిని చైర్మన్ పదవి నుంచి దింపేందుకు ఎమ్మెల్యే వర్గం కంకణబద్ధులై ఉన్నారు. నెలన్నర రోజులుగా మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య వర్గం కౌన్సిలర్లు అధిష్టానాన్ని ఒప్పించే ప్రయత్నం చేశారు. నెలన్నర అనంతరం అధిష్టానం నుంచి గ్రీన్‌సిగ్నల్ రావడంతో కలెక్టర్ ఆదేశాలతో అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నోటీసులను ఆత్మకూరు ఆర్‌డీవో నాగజ్యోతి కౌన్సిలర్లకు జారీ చేశారు. దీంతో మే 8వ తేదీన ఉదయం 11గంటలకు మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. చైర్మన్ మార్పుపై పట్టణంలో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఆది నుంచి ఎడముఖం.. పెడముఖం..?

మున్సిపాల్టీలో 29 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అందులో టీడీపీ నుంచి భాస్కర్‌రెడ్డి ఒక్కరే గెలిచారు. మిగిలిన వారంతా వైసీపీలోనూ, వైసీపీ రెబల్స్‌గా నామినేషన్లు వేసి గెలిచినవారే. అప్పట్లో జాకీర్ హుస్సేన్‌కు మున్సిపల్ చైర్మన్ పదవి ఇస్తామని చెప్పి గెలిచాక బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా దాసి సుధాకర్‌రెడ్డిని ఎంపికచేసి, కంటితుడుపుగా వైస్‌చైర్మన్ పోస్టును జాకీర్‌హుస్సేన్ సోదరుడైన రబ్బానీకి కట్టబెట్టారన్న ప్రచారం అప్పట్లో జోరుగా సాగింది. దీంతో మున్సిపల్ కౌన్సిల్ బాడీ ఏర్పడిన నాటి నుంచి చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, జాకీర్ హుస్సేన్‌ల మధ్య దూరం పెరుగుతూ వచ్చింది. దీంతో జాకీర్‌హుస్సేన్, రబ్బానీ బైరెడ్డి అప్పటి ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్‌కు చేరువయ్యారు. ఆర్థర్ వర్గానికి చెందిన కౌన్సిలర్ల పనులను అటకెక్కించారని సమావేశాల్లో కౌన్సిలర్లు పలుమార్లు ఆవేదన వ్యక్తంచేశారు.

చీనీ రైతుల కష్టాలు



- టన్ను రూ.50 వేల నుంచి రూ.15 వేలకు పతనం
- ముందుకు రాని వ్యాపారులు
- దళారుల బెడద అధికం ● తెగుళ్లతో దెబ్బతిన్న తోటలు
- నష్టపోతున్నామంటూ రైతుల ఆవేదన

చాగలమర్రి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): చీనీ కాయల ధర రోజురోజుకూ పడిపోతోంది. టన్ను రూ.50 వేల నుంచి రూ.15 వేలకు దిగజారిపోయింది. కోత సమయంలో ధరలు తగ్గిపోవడంతో రైతులు దగాపడుతున్నారు. ప్రతి ఏటా ఇంతే. పంట దిగుబడి లేనప్పుడు ధర బాగా ఉంటుంది. కాయ చేతికొచ్చాక ధర తగ్గిపోతుంది. మార్కెట్ మాయాజాలంతో రైతులు దగా పడుతున్నారు. వ్యాపారులు కొనడానికి ముందుకు రావడం లేదు. వ్యాపారులు చెప్పిన ధరకే విక్రయించుకోవాల్సి వస్తోంది. నంద్యాల జిల్లాలో 1,389 ఎకరాల్లో చీనీ సాగు చేశారు. బనగానపల్లెలో 700 ఎకరాలు, నందికొట్కూరులో 92 ఎకరాలు, డోన్‌లో 104 ఎకరాలు, పాణ్యంలో 20, నంద్యాలలో 22, ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని చాగలమర్రి మండలంలో 84 ఎకరాలు, ఆళ్లగడ్డలో 20, ఉయ్యాలవాడ 65, రుద్రవరం 63 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. శిరివెళ్ల, దొర్నిపాడు, శ్రీశైలం నియోజకవర్గంలో చీనీ సాగు చేయడం లేదు.



కొలుములపేటలో సాగు చేసిన చీనీ తోట

రూ.50 వేల నుంచి రూ.15 వేలకు..



జిల్లాలో చీనీ ధరలు ఉన్నట్లుండి పడిపోయాయి. ప్రస్తుతం టన్ను రూ.15 వేలు పలుకుతోంది. వ్యాపారులు పొలం వద్దకు వచ్చి ఇంత తక్కువ ధర చెప్పడంతో కాయలు అమ్మాలో లేదో తెలియక రైతులు దిగాలు పడుతున్నారు. రెండు నెలల క్రితం వరకు ధరలు రోజు రోజుకూ పెరుగుతూ వచ్చాయి. టన్ను రూ.50 వేలు కూడా పలికాయి. ప్రస్తుతం ధర రూ.15 వేలకు పడిపోయింది. దీనికి కారణం ఇతర రాష్ట్రాల్లో భారీగా అకాల వర్షాలు కురవడమేనని వ్యాపారులు అంటున్నారు. ఢిల్లీ, ముంబై, కలకత్తా తదితర ప్రాంతాల్లో వ్యాపారం మందగించిందని, ఎగుమతులు లేకపోవడంతో ధరలు పడిపోయాయని వ్యాపారులు అంటున్నారు.

టన్ను రూ.25 వేలు ఉంటేనే..



నంద్యాల జిల్లాలో 1,389 ఎకరాల్లో చీనీ సాగు ఉంది. సాగు చేసినప్పటి నుంచి ఐదేళ్ల పాటు ఎలాంటి ఫలసాయం ఉండదు. మూడేళ్ల పాటు అంతర్ పంటలు సాగు చేసుకోవచ్చు. కంటికి రెప్పలా కాపాడుకుంటే ఆ తరువాత దిగుబడి మొదలవుతుంది. ఈ సమయంలో మార్కెట్ హెచ్చుతగ్గుల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. చీనీ ధర కనీసం రూ.25 వేలకు పైగా ఉంటేనే రైతుకు గిట్టుబాటు అవుతుందని అంటున్నారు. ప్రస్తుతం చీనీ చెట్లకు తెగుళ్ల బెడద అధికంగా ఉంది. తెగుళ్ల నివారణకు అధిక మోతాదులో క్రిమిసంహారక మందులు వాడాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. రసాయనిక ఎరువులు, సేంద్రియ ఎరువుల ధరలు బాగా పెరిగాయని, వీటన్నింటిని తట్టుకోవాలంటే చీనీ టన్ను కనీసం రూ.25 వేలు ఉంటేనే గిట్టుబాటు అవుతుందని రైతులు అంటున్నారు. వ్యాపారులు చెప్పిన ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధర నిర్ణయిస్తారు. దళారుల బెడద కూడా అధికంగా ఉంది. ప్రభుత్వం మార్కెట్ సౌకర్యం కల్పించి ఆదుకోవాలి.


తెగుళ్లతో ఎండిన చీనీ చెట్టును చూపిస్తున్న రైతు

● ధరలు లేక తోటల్లోనే కాయలు

ధరలు లేకపోవడంతో రైతులు చీనీ కాయలు అమ్మేందుకు ఇష్టపడటం లేదు. జిల్లాలో చెప్పుకునే స్థాయిలో వర్షాలు కూడా కురవలేదు. ధర ఉంటే త్వరగా చీనీ కాయలు మార్కెట్‌కు తరలిస్తే మరోకాపుకు వాతావరణం అనుకూలంగా ఉంటుందని రైతులు అంటున్నారు. ధరలు లేకపోవడంతో కాయలు అమ్మేందుకు రైతులు సిద్ధపడటం లేదు. తోటల వద్దకు వచ్చే వ్యాపారులేమో మార్కెట్‌లో ఉన్న ధరకంటే తక్కువకు అడుగుతున్నారు. అమ్మకుండా ఉంటే చెట్లకే కాయలు మాగి రాలిపోయే ప్రమాదం ఉంది. కొందరు రైతులు చెట్లకున్న కాయలను గ్రేడింగ్ చేయించి తక్కువ ధరకే విక్రయించుకుంటున్నారు. అయితే ఈ ధరకు పెట్టుబడులు కూడా రావడం లేదని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి రాయితీలు కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

దిగుబడి సమయంలో ధర లేదు



మూడు ఎకరాల్లో చీనీ పంట సాగు చేశా. దిగుబడి వచ్చే సమయంలో ధర లేకపోవడంతో వ్యాపారులు అడిగిన ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది. పెట్టుబడి కూడా రావడం లేదు. చీనీకాయల వ్యాపారం సాగేలా ప్రభుత్వం చూడాలి.

- చంద్రశేఖర్‌రెడ్డి, రైతు, కొలుములపేట గ్రామం

ధరలేక నష్టపోతున్నాం



చీనీ పంట సాగు వల్ల ధర లేక నష్టపోతున్నాం. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ఎండలకు కాయలు దెబ్బతిని నల్లబారుతున్నాయి. పంట దిగుబడి వచ్చేసరికి ధరలు లేవు. వ్యాపారులు అడిగిన ధరకే అమ్ముతున్నాం. డ్రిప్ సౌకర్యం కల్పించి ప్రభుత్వమే ఆదుకోవాలి.

- నరసింహారెడ్డి, రైతు, కొలుములపేట

రాయితీలు కల్పించాలి



నాలుగు ఎకరాల్లో చీనీ తోట సాగు చేశా. ఐదేళ్ల పాటు పంటను కాపాడుకుంటూ వచ్చా. దిగుబడి వచ్చే సమయానికి ధరలేదు. ధరలు తగ్గడంతో వ్యాపారులు ముందుకు రావడం లేదు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం. తెగుళ్లతో చెట్లు కూడా దెబ్బతింటున్నాయి. ఎన్ని పురుగు మందులు వాడిన పురుగు చావడం లేదు. దీంతో దిగుబడి కూడా తగ్గుతోంది. తెగుళ్ల నివారణకు సూచనలు, సలహాలు ఇచ్చి ఆదుకోవాలి.

- చిన్న సంజీవరెడ్డి, రైతు, కొలుములపేట

ప్రచారాలకే.. పరిమితం

ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పొలం పిలుస్తోంది కార్యక్రమానికి నిర్లక్ష్యపు నీడలు కమ్ముకున్నాయి. ప్రతి మంగళ, బుధవారం జరిగే ఈ కార్యక్రమం కేవలం ప్రచారానికే పరిమితమైంది. రైతులను అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చేందుకు ప్రారంభించిన 'పొలం పిలుస్తోంది'కు రైతులు, అనుబంధ శాఖల అధికారులు హాజరు కావడంలేదు. దీంతో మండలాల్లో వ్యవసాయాధికారులు తూతూ మంత్రంగా సమావేశం నిర్వహించి ఫొటోలు దిగి ముగించేస్తున్నారు. ప్రజాప్రతినిధులకు సమాచారం ఇచ్చినా హాజరు కావడం లేదు. ప్రభుత్వ ఆశయం నెరవేరే విధంగా పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా, ఉపయోగకరంగా నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.


గడివేముల మండలంలో ఫొటోలకే పరిమితమైన పొలం పిలుస్తోంది

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతులకు పంటల సాగు, సస్యరక్షణ, ఎరువుల వినియోగం అంశాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని అమలుచేస్తోంది. ఈ కార్యక్రమం కేవలం ప్రచారార్భాటాలకే పరిమితమైంది. ఖరీఫ్, రబీ సీజన్లలో నంద్యాల జిల్లాలోని 29మండలాల్లో ప్రతి మంగళ, బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈకార్యక్రమానికి వ్యవసాయ, అను బంధశాఖల అధికారులు, శాస్త్రవేత్తలు తప్పనిసరిగా హాజరుకావాలి. కానీ కేవలం మండల వ్యవసాయాధికారులు మాత్రమే ఇద్దరు, ముగ్గురు రైతులతో ఫొటోలు దిగుతూ తూతూమంత్రంగా ముగిస్తున్నారు.

- క్షేత్రస్థాయిలో అమలుకాని 'పొలం పిలుస్తోంది'
- హాజరు కాని రైతులు, అధికారులు
- ఆసక్తి చూపని ప్రజాప్రతినిధులు
- సమావేశాల కోసం నిధులు సైతం మంజూరు

పత్తాలేని అనుబంధశాఖల అధికారులు

పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమ, పశుసంవర్ధక, మార్కెటింగ్, ఆత్మ, ప్రకృతిసేద్యం, డెయిరీ, మత్స్యశాఖ, సూక్ష్మనీటిసాగు విభాగాల అధికారులు, శాస్త్రవేత్తలు హాజరై రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలి. ఉదయం 8.30గంటల నుంచి 10గంటల వరకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయడం, అనంతరం 10గంటల నుంచి 12 గంటల దాకా నిపుణులు, శాస్త్రవేత్తలను రప్పించి రైతులతో ముఖాముఖి మాట్లాడించాలి. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎంపిక చేసిన గ్రామాల్లో రైతులు సాగుచేసిన పంటలను చూడాలి. ఆ తర్వాత 4గంటల నుంచి 5.30గంటల వరకు సమావేశాన్ని ఏర్పాటుచేసి రైతుల సందేహాలను నివృత్తిచేసి, రైతుల ఆదాయాన్ని గతంలో కంటే గణనీయంగా పెంచాలి. పాడిపరిశ్రమ అధికారులు పశుపోషణపై పాడిరైతులకు అవగాహన కల్పించాలి. అదేవిధంగా భూసార పరీక్షలు నిర్వహించి మట్టినమూనాలు సేకరించడంతో పాటు అందుకు అనుగుణంగా రైతులు వినియోగించాల్సిన ఎరువులపై స్పష్టత ఇవ్వాలి. కానీ మండల వ్యవసాయాధికారి ఎఫ్‌పీవోలు మినహా ఏఒక్క అనుబంధశాఖల అధికారులు హాజరుకాకపోవడం అత్యంత దారుణం.

నిర్వహణకు నిధులు

ప్రతి మంగళ, బుధవారం నిర్వహించే ఈ కార్యక్రమ నిర్వహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. రబీ సీజన్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి నంద్యాల జిల్లాకు రూ.2,50,000 మంజూరు చేస్తోంది. ఇందులో ఒక్కసారిగా కొనుగోలు చేయాల్సిన ఫ్లెక్సీకి రూ.150లు, కరపత్రాల ముద్రణకు రూ.3000, ఇక ప్రతి సమావేశానికి రూ.1500లతో పాటు మైకు, టీ, బిస్కెట్‌లకు రూ.1000 మంజూరు చేస్తోంది. ప్రతి సమావేశానికి ఆయా మండలాల వ్యవసాయ అధికారులు, సిబ్బంది హాజరై 30 నుంచి 50 మంది రైతులను సేకరించి వారితో కలిసి క్షేత్రస్థాయి పరిశీలనతో పాటు సమావేశాన్ని నిర్వహించాలి.

అధికారులందరూ తప్పక హాజరు కావాలి

పొలం పిలుస్తోంది కార్యక్రమానికి వ్యవసాయశాఖలోని ప్రతి అనుబంధశాఖ అధికారి తప్పనిసరిగా హాజరుకావాలి. క్షేత్రస్థాయిలో ఆవిధంగా జరగడం లేదు. ఈ విషయాన్ని కలెక్టర్‌తో పాటు వ్యవసాయశాఖ కమిషనర్ దృష్టికి కూడా తీసుకెళ్లి మరింత సమర్థవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటాం. అక్కడక్కడా కొంతమంది ఉన్నతాధికారులు మాత్రం హాజరవుతున్నారు.

- మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి, నంద్యాల


మహానంది మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

ముందురోజే సమాచారం ఇస్తున్నా..

ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు సైతం అటువైపు కన్నెత్తి చూడడంలేదు. ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులకు ముందురోజే సమాచారం ఇస్తున్నా ఏఒక్కరూ హాజరుకావడం లేదు. ఇక ఎమ్మెల్యేలు, ఎంపీలు అటువైపు ఆలోచనే చేయకపోవడంతో అధికారులు కూడా కార్యక్రమాన్ని తూతూమంత్రంగా ముగించేస్తున్నారు. కార్యక్రమాన్ని ప్రతి వారానికి బదులు ప్రతి 15రోజులకు ఒకసారి నిర్వహిస్తే బాగుంటుందనే అభిప్రాయం కూడా వారిలో వ్యక్తమవుతోంది.

'పీఎం సూర్యఘర్' అమలులో పురోగతి తేవాలి

- మోడల్ సోలార్ విలేజీ నియోజకవర్గానికి ఒక గ్రామం ఎంపిక
- కలెక్టర్ రంజిత్‌బాషా
- పథకాల అమలుపై అధికారులతో సమీక్ష

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఎం సూర్యఘర్ అమలులో పురోగతి తీసుకురావాలని కలెక్టర్ రంజిత్ బాషా ఏపీఎస్ పీడీసీఎల్ ఎస్‌ఈని ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల అమలు పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పీఎం సూర్యఘర్ పథకం కింద ఇప్పటి వరకు 87,477 మంది రిజిస్టర్ అయ్యారని, ఏపీఈఆర్‌సీ నుంచి ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన అప్రూవల్ వచ్చిన వెంటనే ప్రాజెక్టులు ప్రారంభించేందుకు తగినచర్యలు తీసుకోవాలని ఎస్‌ఈని ఆదేశించారు. ఇతరులకు సంబంధించి కేవలం 442 మాత్రమే చేశారనీ వాటిలో కూడా పురోగతి తీసుకురావాలన్నారు. మోడల్ సోలార్ గ్రామాల కింద నియోజకవర్గానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేయడం జరిగిందన్నారు. మోడల్ సోలార్ గ్రామాల్లో 100 ఇళ్లకు సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేయాలన్నారు. పీఎం కుసుమ్‌కి సంబంధించి మే 8వ తేదీన టెండరు పనులు పూర్తికాగానే వాటిని ఏవిధంగా ఇన్‌స్టాల్ చేయాలనే యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్‌పీడీఎస్‌ఎల్ ఎస్‌ఈ ఉమాపతి, ఈఈ ఓబులేసు, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, మెప్మా పీడీ నాగశివలీల పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, సభ్యులు

ఆధునిక సాహిత్యంలో శ్రీశ్రీ చెరగని ముద్ర

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆధునిక తెలుగు సాహిత్యంలో మహాకవి శ్రీశ్రీ సుస్థిర స్థానం సంపాదించారని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య కొనియాడారు. బుధవారం శ్రీశ్రీ 116వ జయంతిని టీజీవీ కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. పలువురు కవులు, కళాకారులు శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ఆధునిక తెలుగు సాహిత్యాన్ని మలుపు తిప్పిన ఘనత శ్రీశ్రీదే అన్నారు. కవిత్వ ప్రస్తావన చేయాలంటే శ్రీశ్రీకి ముందు, శ్రీశ్రీకి తర్వాత అనే ఒరవడిని ఆయన సృష్టించారన్నారు. ఈ కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం కార్యదర్శి మహ్మద్ మియా, సాహితి స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, కళాకారులు, జీవీ శ్రీనివాసరెడ్డి, కే.బాల వెంకటేశ్వర్లు, బసవరాజు, కళాక్షేత్రం సభ్యులు ఈశ్వరయ్య, సంగా ఆంజనేయులు, యాగంటీశ్వరప్ప, కదిరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామ దేవత ఉత్సవాలు

- అమ్మవార్లకు జల, పుష్పాభిషేకం ● మొక్కులు తీర్చుకున్న భక్తులు


అమ్మవారి వేషధారణలో పశ్చిమ గోదావరి జిల్లా కళాకారుల నృత్యాలు


పార్లపల్లిలో కుంభోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్లపల్లి, కలుగోట్ల గ్రామాల్లో గ్రామదేవత ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున అమ్మవార్లకు జలాభిషేకం, పుష్పాభిషేకం, కుంకుమార్చన చేసి ప్రత్యేక అలంకరణ చేసి మహా మంగళ హారతి ఇచ్చారు. అనంతరం గ్రామాల్లోని మహిళలు, భక్తులు పెద్దసంఖ్యలో కుంభాలతో నైవేద్యాలు తీసుకెళ్లి అమ్మవార్లకు సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. పార్లపల్లి గ్రామంలో పశ్చిమ గోదావరి జిల్లా నుంచి వచ్చిన కళాకారులు అమ్మవారి వేషధారణలో చేసిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కలుగోట్ల, పార్లపల్లి గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు.

కార్మిక పోరాట దినం

5వ పేజీ తరువాయి



కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చేసింది. పలు ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరించేసింది. ఇలాంటి సందర్భంలో 139వ కార్మిక దినోత్సవం వివిధ కార్మిక సంస్థల ఆధ్వర్యంలో పోరాటాలు జరగాల్సి ఉంది.

● హక్కులు హరిస్తున్నారు



ప్రాణత్యాగాలు చేసి కార్మికులు సాధించుకున్న హక్కులు, చట్టాలను ప్రభుత్వాలు హరిస్తున్నాయి. రోజు 8 గంటలు చొప్పున వారంలో 48 గంటల పని విధానం చట్టాలను రద్దు చేసి వారానికి 90 గంటలు పని చేసేలా చట్టాలు తీసుకొస్తున్నారు.

- ఎండీ అంజిబాబు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, కర్నూలు

● కార్మిక చట్టాలను రద్దు చేసి కోడ్లు తెచ్చారు



కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలు రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లు తీసుకొచ్చారు. ఇది మేడే స్ఫూర్తికి విరుద్ధం. కార్పొరేట్లకు అనుకూలంగా కార్మిక హక్కులను కాలరాస్తున్నారు.

- ఎస్.మునెప్ప, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కర్నూలు

రంగవల్లికలో రాఘవేంద్రస్వామి

- 400 అడుగుల పొడవు, వెడల్పుతో రంగోలి
- తీర్చిదిద్దిన మైసూర్‌కు చెందిన రంగోలి వరల్డ్ రికార్డు ఆర్టిస్టులు



మంత్రాలయం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి రంగవల్లికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మైసూర్‌కు చెందిన రంగోలి వరల్డ్ రికార్డు ఆర్టిస్టు పునీత్‌కుమార్, లక్ష్మి 400 అడుగుల పొడవు, వెడల్పుతో రాఘవేంద్రస్వామిని రంగోలితో చిత్రీకరించారు. బుధవారం అక్షయ తృతీయ సందర్భంగా 3వేల కేజీల రంగోలితో 22 గంటలు శ్రమించి తొమ్మిది మంది రాఘవేంద్ర స్వామి చిత్రాన్ని వివిధరంగుల ముగ్గుపొడితో అందంగా తీర్చిదిద్దారు. మధ్వమార్గ్ కారిడార్‌లో రాఘవేంద్రస్వామి నిలువుతో వీణ పట్టుకున్న చిత్రీకరణను అలంకరించారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. కళాకారులను పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు జ్ఞాపిక, శేషవస్త్రం ఇచ్చి సత్కరించారు.

రాజధాని నిర్మాణంతో బంగారు భవిష్యత్

- అమరావతిపై జగన్ రెడ్డి విధ్వంసం
- టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



ఓర్వకల్లు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని నిర్మాణంతో భావితరాలకు బంగారు భవిష్యత్ లభిస్తుందని టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని హుశేనాపు రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి రాజధాని విధ్వంసానికి గురై అభివృద్ధికి నోచుకోలేదన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అమరావతి నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. రూ.45వేల కోట్లతో రాజధాని రూపుదిద్దుకుంటుందని అన్నారు. అమరావతి రాజధాని ప్రపంచంలోనే తొలి సోలార్ నగరంగా చరిత్ర సృష్టించబోతుందన్నారు. ప్రపంచ బ్యాంకు నుంచి రూ.15వేల కోట్ల రుణం మంజూరైందని జర్మనీకి చెందిన డెవలప్‌మెంట్ బ్యాంకు కేఎస్‌డబ్ల్యూ నుంచి రూ.5వేల కోట్లు రుణం పొందేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో గృహాలు పూర్తి చేసి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మరో రూ.4,400 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరా వతిలో రాజధాని నిర్మించడానికి మద్దతు తెలిపి అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల పేరుతో కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టిన జగన్ నిజస్వరూపాన్ని ప్రజలు తెలుసుకున్నారన్నారు. దళిత రైతులపై అక్రమ కేసులు పెట్టడమే కాకుండా దళితులపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు బనాయించి వారి చేతులకు బేడీలు వేసి జైళ్లకు తరలించిన దుర్మార్గ వ్యక్తి జగన్ అని అన్నారు.

లక్ష్మీనారాయణ హత్య కేసులో ముమ్మర దర్యాప్తు



- రెండు జిల్లాల్లో పోలీసుల విచారణ
- దర్యాప్తు చేస్తున్న అడిషనల్ ఎస్పీ
- ఓ మహిళ పాత్రపై విచారణ
- తెర వెనుక మరి కొందరి పెద్దల హస్తం?

ఆలూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆలూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి లక్ష్మీనారాయణ హత్య కేసు దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు. ఈ కేసు విచారణ అధికారి అడిషనల్ ఎస్పీ హుసేన్‌పీరా నేతృత్వంలో ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి, చిప్పగిరి, అనంతపురం జిల్లా గుంతకల్‌లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. లక్ష్మీనారాయణ తరచుగా ఎక్కడ ఉండేవారు? ఆయన ఎలాంటి పంచాయతీలు చేసేవారు? అనే వాటిపై ఆరా తీస్తున్నారు. ఓ భూ వివాదంలో హత్యకు గురైన లక్ష్మీ నారాయణకు గుంతకల్‌కు చెందిన ఓ మహిళతో గొడవలు తారాస్థాయిలో ఉన్నట్లు పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చాయి. ఈ క్రమంలోనే హత్యకు గుంతకల్‌లోనే ప్రణాళిక వేసినట్లు తెలుస్తున్నది. ఇందుకోసం గుంతకల్‌లో అధికార పార్టీకి చెందిన బడా నేత సహాయం కూడా కోరినట్లు సమాచారం. ఇందుకు ఆర్థిక వనరులు ఓ నేత కనుసన్నల్లో సమకూరినట్లు తెలుస్తున్నది. హత్య జరిగిన ప్రాంతంలోంచి నిందితులను స్వయంగా ఆ మహిళ తీసుకుని వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఇప్పటికే ఈ కేసులో కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మరో రెండు రోజుల్లో ఈ కేసు ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉందని సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు.

కుందూలో మునిగి వ్యక్తి మృతి

కోవెలకుంట్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గొర్రెలను మేత కోసం తీసికెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు కుందూలో మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన రేవనూరు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన బాలుడు కుమారుడు జయవర్ధన్(22) గొర్రెలను ఉప్పలూరు సమీపంలోని పంట పొలాల నుండి కుందూనది అవతల గట్టుకు మేత కోసం తోలుకొని వెళ్తూ ప్రవాహం ఎక్కువగా ఉన్న చోట మునిగిపోయి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. నదిలో నుండి మృతదేహాన్ని బయటికి తీసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై రేవనూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ భూపాలుడు తెలిపారు.



మృతదేహాన్ని బయటికి తీస్తున్న గజ ఈతగాళ్లు

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

కర్నూలు క్రైం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో బళ్లారి చౌరస్తా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ పరీక్షలకు సిద్ధమవుతున్న పరశురాముడు (26) అనే యువకుడు దుర్మరణం చెందారు. జూపాడుబంగ్లా మండలం తరిగోపుల గ్రామానికి చెందిన పరశురాముడు ఇటీవలే కానిస్టేబుల్ ఫిజికల్ ఈవెంట్‌లో ఉత్తీర్ణత సాధించి రాత పరీక్షకు అర్హత పొందారు. మరో నెల రోజుల్లో రాత పరీక్షలు రాయాలి. ఇందు కోసం సాయికృష్ణ డిగ్రీ కాలేజీ సమీపంలో ఓ గదిని అద్దెకు తీసుకుని పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారు. బుధవారం తెల్లవారుజామున మిత్రుడు ఎల్లానాయుడుతో కలిసి హైదరాబాదు వైపు నుంచి మోటారు సైకిల్‌పై వస్తున్నారు. బళ్లారి చౌరస్తా సమీపంలో అదుపు తప్పి వీరి మోటారు సైకిల్ కింద పడింది. కుక్క అడ్డు రావడంతో తప్పించబోయి కింద పడినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో పరుశురాముడు అక్కడికక్కడే మృతి చెందారు. వెనుకాల కూర్చున్న ఎల్లనాయుడుకు స్వల్ప గాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు.

కల్వర్టును ఢీకొన్న లారీ

కోడుమూరు రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాలకుర్తి-కొత్తూరు గ్రామాల మధ్య బుధవారం ఓ లారీ కల్వర్టును ఢీకొట్టింది. వివరాలివీ... భద్రావతి నుంచి కర్నూలుకు బెల్లం లోడుతో వస్తున్న లారీ ప్యాలకుర్తి దాటాక ఎదురుగా వస్తున్న బస్సు మీదకు దూసుకు రావడంతో తప్పించబోయి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ క్లీనర్‌కు గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ వలి క్షేమంగా బయటపడ్డారు. ఘటనలో లారీ చక్రాలు ఊడిపోవడంతో పాటు పలు భాగాలు దెబ్బతిన్నాయి.

లారీ, ఆటో ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

కోడుమూరు రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వర్కూరులో బుధవారం మధ్యాహ్నం లారీ ఆటో ఢీకొన్నాయి. కోడుమూరు నుంచి కైరవాడి గ్రామానికి ఇనుప కడ్డీలను తీసుకెళ్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఆటో ధ్వంసం అయింది. డ్రైవర్ కుమార్ ఆచారికి తీవ్రగాయాలు కావడంతో కర్నూలు తరలించారు. కాగా రెండు వాహనాలు కూడా కైరవాడికి చెందినట్లు సమాచారం.

స్పిల్‌వే గేట్ల మరమ్మతులకు చర్యలు

- ఎంపీ బైరెడ్డి శబరి



రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి

అవుకు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అవుకు రిజర్వాయర్ స్పిల్‌వే గేట్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నట్లు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం ఆమె అవుకు రిజర్వాయర్‌ను పరిశీలించిన అనంతరం అవుకు రిజర్వాయర్ స్పిల్‌వే గేట్లు గురించి జేఈ జయప్రకాశ్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పాత మూడు తూముల్లో రెండు బ్లాక్‌కాగా ఒక తూము నుంచి నీరు లీకేజీ అవుతుందని ఆమెకు అధికారి వివరించారు. అవుకు రిజర్వాయర్ సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని బైరెడ్డి శబరి పేర్కొన్నారు.

సకల సౌకర్యాలతో..



దుస్తుల నాణ్యతను పరిశీలిస్తున్న ఎస్ఎస్ఏ ఏపీసీ, ఇన్‌సెట్‌లో పుస్తకాల పరిశీలన

నంద్యాల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించనుంది. విడతల వారీగా అన్నిరకాల సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో మొదటి విడతలో భాగంగా.. తాజాగా బుధవారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న 1,43,707 మంది విద్యార్థులకు దుస్తులు (యూనిఫామ్స్), టెక్స్‌బుక్స్ ప్రభుత్వం సరఫరా చేసింది. దీంతో జిల్లా సమగ్ర శిక్షా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్(ఏపీసీ) ప్రేమంత్ కుమార్ నేతృత్వంలో సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలోని బనగానపల్లి, బేతంచెర్ల పాఠశాలలో దుస్తులు, టెక్స్‌బుక్స్ (పుస్తకాలను) అన్‌లోడ్ చేశారు. త్వరలోనే ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు కూడా రానున్నాయి. వీటితో పాటు అందరికి త్వరలో షూస్‌తో పాటు బ్యాగులు కూడా రానున్నాయి. ఏది ఏమైనా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో.. 2025-26కి సంబంధించి ప్రణాళికా బద్ధంగా విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడం సదరు విద్యార్థులకు వరంగా మారినట్లైంది.

విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం



ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యా ర్థులకు అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పించనుంది. ఇదే క్రమంలో పాఠశాలలో విద్యార్థులు చేరే సంఖ్య కూడా ఈ ఏడాది పెరిగే అవకాశం లేకపోలేదు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు కేజీబీవీ, మోడల్ స్కూల్స్‌లో సైతం ఇదే తరహాలో సదుపాయాలు, సౌకర్యాలు కల్పించడం జరుగుతోంది.

- నాణ్యమైన విద్యే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలలు
- పేద విద్యార్థులకు శుభవార్త
- ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు యూనిఫామ్స్, బుక్స్ సరఫరా
- త్వరలో బ్యాగ్‌లు, షూస్
- విద్యార్థులు పెరిగే అవకాశం

మొదటి విడతలో భాగంగా..

మొదటి విడతలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో 6నుంచి 10వ తరగతి చదువుతున్న 1,43,707మంది విద్యార్థులకు సంబంధించి.. ఒక్కొక్కరికి మూడు జతల చొప్పున దుస్తుల మెటీరియల్ ప్రభుత్వం సరఫరా చేస్తుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ముందస్తూ పంపిణీ చేయడం గమనార్హం. ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ కూడా విద్యార్థులకు అందించనున్నారు.

ఎంతో నాణ్యతగా ఉన్నాయి



ప్రభుత్వం విద్యార్థులకు అందించిన దుస్తుల మెటీరి యల్ ఎంతో నాణ్యతగా ఉన్నాయి. 2025-26 విద్యా సంవత్సరం ఆరంభానికి ముందే దుస్తులు, బుక్స్ సరఫరా చేశారు. త్వరలోనే బ్యాగులు, షూష్ కూడా వస్తాయి. కార్పొరేట్ దిశగా సేవలు అభినందనీయం. **- ప్రేమంత్‌కుమార్, ఏపీసీ సమగ్ర శిక్షా, నంద్యాల**

మరో వారంలో...

రెండవ విడతగా ప్రభుత్వ పాఠశా లలో 1నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు బుక్స్‌తో పాటు వర్క్ బుక్స్, దుస్తులు సరఫరా చేయనున్నారు. దుస్తుల మెటీరియల్‌ను కుట్టించడం కోసం అయ్యే ఖర్చును కూడా ఆయా విద్యార్థుల వారీగా తల్లుల ఖాతాలకు జమచేయనున్నారు.

ప్రాణాలు తీసే పిడుగులు

- అవగాహనతో జాగ్రత్తలు తీసుకోవాలి
- సాంకేతికత పెరిగినా తగ్గని ప్రమాదాలు



కొలిమిగుండ్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటు ప్రాణాంతకం. వేసవి కాలంలో వానలు కురిసేటప్పుడు మేఘాల్లో జరిగే అలజడి కారణంగా పిడుగులు పడతాయి. పిడుగుపాటుకు మనుషులే కాదు జంతువులు కూడా మరణిస్తుంటాయి. పెరిగిన సాంకేతికతతో విపత్తుల నిర్వహణ సంస్థ ఎప్పటికప్పుడు మొబైల్ ఫోన్‌ల ద్వారా మేసేజ్ పంపుతూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నా అప్పుడప్పుడు పిడుగుల వల్ల తీవ్ర ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ ఏడాది ఏప్రిల్ మాసంలోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలో 10 వరకూ మృత్యువాత పడగా, పలుచోట్ల పశువులు, ఇతర జంతువులు మృత్యువాత పడ్డాయి. గృహోపకరణాలు కాలిపోయిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఇంతటి తీవ్రమైన సమస్య పట్ల ప్రజల్లో అవగాహన లేకపోవడం తీవ్ర బాధాకరమని పలువురు వాపోతున్నారు. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకున్నా ప్రాణాలు నిలుపుకునే అవకాశం ఉన్నా గ్రామీణ ప్రజల్లో మార్పు రావడంలేదు.

సాంకేతికత పెరిగినా అవగాహనలేమి

గతంతో పోలిస్తే వాతావరణంలో వచ్చిన మార్పులను విపత్తుల నిర్వహణ సంస్థ ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తోంది. ప్రతి ఒక్కరి దగ్గర సెల్‌ఫోన్ ఉంటుంది. తెలుగులోనే సందేశాలు వస్తున్నాయి. వాతావరణ శాఖ మేసేజ్ పంపిన సమయంలో ఖచ్చితంగా పిడుగులు పడుతూనే ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పొలాల్లోకి వెళ్లిన గొర్రెల కాపర్లను, రైతులను వారి కుటుంబ సభ్యులు అప్రమత్తం చేస్తే ప్రాణాపాయం నుండి బయటపడే అవకాశం వుంది. అయినా చిన్నపాటి జాగ్రత్తలు తీసుకోవడంలో ప్రజలు నర్లక్ష్యం వహిస్తున్నారు.

పిడుగుకు 30 కోట్ల మెగా వాట్ల శక్తి ఉంటుంది

ఒక పిడుగుకు సుమారు 30కోట్ల మెగావాట్ల శక్తి ఉంటుంది. మేఘాలలో నీరు ద్రవ, ఘన రూపంలోకి మారే సమయంలో రుణ, ధనావేశాలు ఏర్పడతాయి. ఆక్రమంలో ఉన్న ఫలంగా మేఘాల నుంచి ఎలక్ట్రాన్లు విడుదలై వాయు వేగంతో భూమిపైకి దూసుకవస్తాయి. వీటినే పిడుగుపాటు అంటారు. అవి ఎత్తైన ప్రదేశాలలో అధికంగా పడతాయి, పెద్ద చెట్లు, భవనాలు, నీటి కొలనులు, లోహం సమూహాలను ఎక్కువగా ఆకర్షిస్తాయి.

ఏప్రిల్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో మరణాల సంఖ్య

- ఈఏడాది ప్రస్తుత ఏప్రిల్ మాసంలోనే ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 10మంది పిడుగు పాటుకు మృత్యువాత పడ్డారంటే పరిస్థితి తీవ్రత అర్థమవుతుంది.
- ఏప్రిల్-16న చిప్పగిరి మండలం ఏరూరు గ్రామంలో రజియా అనే మహిళ పిడుగు పాటుకు మరణించింది.
- ఏప్రిల్-18న బనగానపల్లె మండలం రామతీర్థం గ్రామంలో బషీర్‌అహ్మద్ మృతి చెందాడు.
- ఏప్రిల్-20న పెద్దకడుబూరు మండలం హనుమాపురం గ్రామానికి చెందిన ఈరన్న, చిప్పగిరికి చెందిన శివన్న, ఎమ్మిగనూరు మండలం హెచ్. మూరవాణి గ్రామానికి చెందిన అడివన్న మృతి చెందారు.
- ఏప్రిల్-21న నందికొట్కూరు మండలం కొణిదేల గ్రామానికి చెందిన వడ్డె లక్ష్మీనరసింహ మృతి చెందాడు.
- ఏప్రిల్-27న కౌతాళం మండలం కాత్రికి గ్రామానికి చెందిన అశోక్, బాలయ్య అనే ఇరువురు యువకులతో పాటు క్రిష్ణగిరి మండలం కటారుకొండ గ్రామానికి చెందిన బోయ శ్రీనివాసులు మృతి చెందారు. వీరితో పాటు చాలా గ్రామాల్లో గొర్రెలు, మేకలు, పశువులు మృత్యువాత పడటంతో పాటు, ఆస్తి నష్టం జరిగింది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పొలాల్లో పని చేస్తున్న వారు త్వరితగతిన ఇళ్లకు చేరుకోవాలి. అందుబాటులో ఉన్న భవనాల్లోకి వెళ్లాలి.
- ఎత్తయిన ప్రదేశాల్లో, పెద్ద చెట్ల కింద, భవనాలపైన ఉండకూడదు.
- వర్షంలో చిక్కినప్పుడు వెంటనే మొబైల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకోవాలి.
- బహిరంగ ప్రదేశాల్లో నిలిచిపోయి, ఎటూ వెళ్లలేని పరిస్థితి ఉంటే మోకాళ్ల మధ్య తల వంచి కూర్చొని, రెండు చెవులూ మూసుకోవాలి.
- ఉరుములు, మెరుపులను కంటితో చూడకూడదు. చూపు మందగిస్తుంది.
- ఉరుములతో వర్షం కురుస్తున్నప్పుడు పొలాల్లో నీళ్ల కట్టడం, ఇంట్లో స్నానాలు చేయడం.. వంటి నీటితో చేసే పనులు ఆపేయాలి.

పల్లె రోడ్లకు మహర్దశ

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 25 పనులు
- మరమ్మతులకు రూ.39.83 కోట్లు మంజూరు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



నంద్యాల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పల్లె రోడ్ల బాగుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పల్లె రోడ్ల మరమ్మతులపై ప్రత్యేక దృష్టిసారించి రూ.కోట్ల నిధులు మంజూరు చేసి పల్లెరోడ్లను బాగు కోసం కృషి చేస్తున్నారు. తాజాగా మరోమారు కేంద్రంతో పాటు రాష్ట్ర వాటాతో కలిపి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోడ్ల మరమ్మతుల కోసం రూ.39.83 కోట్లు మంజూరు చేసింది. 25 పనుల్లో పరంగా 88.46 కిలోమీటర్ల బీటీ(తారు) రోడ్లకు ఈ నిధులు వినియోగించనున్నారు. ఇందులో కూడా కర్నూలు జిల్లాలో 43 కిలోమీటర్లు, నంద్యాల జిల్లాలో 45.46 కిలోమీటర్లలో మరమ్మతు పనులు చేస్తారు. కర్నూలు జిల్లాకు రూ.19.68 కోట్లు, నంద్యాల జిల్లాకు రూ.20.15 కోట్లు కేటాయించారు. ఇదిలా ఉండగా గ్రామీణ రహదారులకు మోక్షం కలిగే విధంగా కూటమి ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా విడతల వారీగా నిధులు కేటాయించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. త్వరలోనే ఈ పనులకు సంబంధించి టెండర్లు పిలవనున్నారు.

పల్లె రోడ్లకు నిధులు

పల్లె రోడ్లకు కేంద్ర, రాష్ట్ర సహకారంతో ఉమ్మడి జిల్లాకు నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే టెండర్లు పిలుస్తాము. ఎస్సీ, ఎస్టీ, సాధారణ ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఈ పనులు చేయడం జరుగుతుంది. గతంలో రోడ్లను గుర్తించి నివేదించడం జరిగింది. ఇంతమునుపు కూడా ప్రభుత్వం రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది.

- నాగరాజు, డీపీఆర్ఈవో, పంచాయతీ రాజ్ శాఖ

ప్రియుడి ఇంటి ఎదుట ట్రాన్స్‌జెండర్ ధర్నా



బైచిగేరిలో హసినిగౌడ్‌తో మాట్లాడుతున్న పోలీసులు



హసిని గౌడ్, గణేష్ (ఫైల్)

ఆదోని రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేశాడంటూ ప్రియుడి ఇంటి ఎదుట ఓ ట్రాన్స్ జెండర్ బైఠాయించి ఆందోళన చేసిన సంఘటన ఆదోని మండలం బైచిగేరి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. బాధిత ట్రాన్స్‌జెండర్ కథనం మేరకు వివరాలు ఇలా... బైచిగేరి గ్రామానికి చెందిన గణేష్, హైదరాబాద్ సిటీ సనత్‌నగర్‌కు చెందిన ట్రాన్స్‌జెండర్ హసిని గౌడ్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం అయ్యారు. పరిచయం కాస్తా ప్రేమగా మారడంతో వారు గత కొంత కాలంగా సహజీవనం చేశారు. గణేష్ ప్రేమలో పడిన హసిని గౌడ్ అతడికి ఖరీదైన సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్, దుస్తులతో పాటు రూ.లక్షల్లో డబ్బు కూడా ఇచ్చింది. ఈ క్రమంలో గతేడాది జూన్‌లో వారిద్దరూ హైదరాబాద్‌లోని ఓ ఆలయంలో వివాహం కూడా చేసుకున్నారు. ఈ విషయాన్ని గణేష్ తన ఇంట్లో చెప్ప కుండా కాలం వెళ్లదీశాడు. వివాహం అనంతరం గణేష్ సొంతూరికి వెళ్ళి తిరిగి రాకపోవడంతో మోసపోయానని తెలిసిన హసినిగౌడ్ హైదరాబాద్ సనత్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ సమయంలో యువకుడు గణేష్ ఓ వివాహం చేసుకున్నాడు. తర్వాత ఈ ఏడాది ఏప్రిల్ 23వ తేదిన మరో అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. వరుస ఘటనలను నిలదీస్తూ ట్రాన్స్‌జెండర్ హసిని గౌడ్ యువకుడి ఇంటి ఎదుట బైఠాయిం చింది. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేసింది. రెండు వివాహాల తర్వాత కూడా తనతో మాట్లాడుతున్నాడని, ముగ్గురం కలసి ఉందామని తనకు ఆశలు రేకెత్తించి మళ్లీ మోసం చేశాడని ఆవేదన వ్యక్తం చేసింది. విషయం తెలుసుకున్న తాలూక పోలీసులు గ్రామానికి చేరుకుని హసినితో పాటు అక్కడ ఉన్న మిగిలిన ట్రాన్స్‌జెండర్లను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. విచారించి తగు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

ఇంజక్షన్‌తో ప్రాణాలు కాపాడారు

వెల్దుర్తి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఛాతి నొప్పితో బాధపడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగులకు సకాలంలో వైద్యం అందించి ప్రాణాలు కాపాడిన ఘటన వెల్దుర్తిలో చోటు చేసుకుంది. వివరాలివీ.. అల్లుగుండు గ్రామానికి చెందిన లక్ష్మమ్మ, వెల్దుర్తికి చెందిన నాగరాజు, గోవర్ధనగిరికి చెందిన నాగార్జున బుధవారం ఛాతీనొప్పితో వెల్దుర్తి ఆసుపత్రిలో చేరారు. వైద్యులు వరప్రసాద్, రంగస్వామి ఈసీజీ తదితర వైద్యపరీక్షలు నిర్వహించి గుండెపోటుగా నిర్ధారించారు. వెనువెంటనే వారికి రూ.45వేలు విలువ చేసే ' టెనెక్టిప్లస్' ఇంజక్షన్ వేశారు. దీంతో వారికి ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపారు. గుండెపోటుతో నిరుపేద ప్రజలు మరణించరాదనే ఉద్దేశంతో ప్రభుత్వం భరోసానిస్తోందన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో గుండెపోటు ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని, గుండెపోటు వచ్చిన మొదటి గంటలోపు రోగిని ఆసుపత్రికి తీసుకువస్తే ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని సూపరింటెండెంట్ బాలచంద్రారెడ్డి తెలిపారు.

వైభవంగా పెద్దమ్మ దేవర


అబ్బీపురంలో ప్రతిష్ఠించిన విగ్రహం

మహానంది, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అబ్బీపురం గ్రామంలో ప్రజలు బుధవారం ఘనంగా పెద్దమ్మ దేవరను నిర్వహించారు. గ్రామ ప్రధాన వీధిలో పెద్దమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రజలు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. కాయ కర్పూరాలు సమర్పించారు. నెల్లూరుకు చెందిన కోలాటం కళాకారులతో చెక్క భజన కార్యక్రమం నిర్వహించారు.

3న విగ్రహ ప్రతిష్ఠ

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లకాలువ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈనెల 3న గణపతి, సీతారామాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ, శ్రీదేవి భూదేవి సహిత చెన్నకేశవ స్వామి ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. ప్రతిష్ఠను పురస్కరించుకొని గురువారం నుంచి వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు ప్రారంభించనున్నారు. గురువారం గోపూజ, గణపతి పూజ, నవగ్రహ ఆరాధన, కంకణ ధారణం, పుణ్యాహ వచనం, గణపతి హోమం, శుక్రవారం మహాస్నపనం, 108 కలశాలతో అభిషేకం, ప్రధాన హోమాల అనంతరం సాయంత్రం గ్రామంలో గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే 3వ తేది విగ్రహ ప్రతిష్ఠ అనంతరం స్వామి అమ్మవార్ల కళ్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్నదానం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

రేపటి నుంచి ఆలయ వార్షిక వేడుకలు

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన షిరిడీ సాయి బాబా దేవస్థానంలో ఈనెల 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు వార్షికోత్సవాలతో పాటు, దత్తాత్రేయ, నందీశ్వరస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ వేడుకలను భక్తజన సందోహం నడుమ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆ ఆలయ అధ్యక్ష కార్యదర్శులు సూర్యనారాయణ, కొత్తశ్రీరామ చంద్రమూర్తి బుధవారం తెలిపారు. శుక్రవారం ఉదయం గోపూజ, గణపతి పూజ, జగద్గురు ఆదిశంకరాచార్యులకు ప్రత్యేక పూజతో పాటు కళశ స్థాపన కార్యక్రమాలు, శనివారం గణపతి హోమం, సుదర్శన హోమం, కుబేర పాశుపత హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం గోపూజ, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఉదయం 11.30 గంటలకు ఆలయంలో లక్ష్మీ సమేత అశ్వర్థ నారాయణ కళ్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 4వ తేది మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా బసవేశ్వరుడి జయంతి

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని బైరమల్ వీధిలో వెలసిన బసవేశ్వరస్వామి ఆలయంలో సంఘసంస్కర్త పరమాత్మ బసవేశ్వర స్వామి జయంతి ఉత్సవాలను వీరశైవ సంక్షేమ సమాజం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆలయంలో అర్చకులు శశిభూషణ సిద్ధాంతి అర్చకత్వంలో స్వామివారి చిత్రపటానికి పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు కార్యక్రమంలో వీరశైవ సమాజ కార్యవర్గ సభ్యులు నాగరాజు, హరి, కిషోర్, మల్లికార్జున, శివప్ప, మల్లప్ప, నాగేశ్వరప్ప, శివప్ప, ప్రసాదు, తదితరులు పాల్గొన్నారు.

'వక్ఫ్ చట్టాల్లో రాజకీయ జోక్యం తగదు'



వెలుగోడులో ర్యాలీ చేస్తున్న ముస్లింలు

వెలుగోడు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్టంలో రాజకీయ జోక్యం తగదని వెలుగోడు జేఏసీ నాయకులు అన్నారు. బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అంతకముందు పహల్గాం జిల్లాలో ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళి అర్పించారు. అనంతరం పాత బస్టాండు నుంచి ప్రధాన సెంటర్ వరకు జాతీయ జెండాలు, నల్ల జెండాలు చేతపట్టి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన సెంటర్లో పలువురు వక్తలు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మైనార్టీల హక్కులను అణిచి వేయాలనే ఉద్దేశంతో దేశంలో నల్ల చట్టాలను తెస్తోందని అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ రాజకీయ లబ్ధి కోసం ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం దురదృష్టకరమని అన్నారు. తహసీల్దార్ కార్యాలయం చేరుకొని తహసీల్దార్ శ్రీనివాసగౌడ్‌కు వినతిపత్రం అందించారు. జేపీసీ కన్వీనర్ మౌలానా జవాద్ అహమ్మద్, సీపీఎం నాయకులు, రాజశేఖర్, మాజీ సర్పంచ్ అబ్దుల్ కలాం, మౌలానా మహబూబ్ రెహమాన్, హిదాయత్ అలీ, మొమీద్ రసూల్, జాకీర్ హుస్సేన్, షబ్బీర్, రఫీ, షబీర్, వలీ, సయ్యద్, మొహమ్మద్‌ఖాన్, సిద్దిక్ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌వోల వినూత్న నిరసన


ఒంటికాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న సీహెచ్‌వోలు

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): డిమాండ్లను నెరవేర్చాలని సీహెచ్‌వోలు బుధవారం నంద్యాలలో ఒంటికాలిపై నిలబడి వినూత్న రీతిలో నిరసన వ్యక్తంచేశారు. జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ, ఉపాధ్య క్షుడు భాస్కర్ మాట్లాడుతూ ఆరేళ్ల దాటిన సీహెచ్‌వోలను క్రమబద్ధీకరిం చాలన్నారు. ప్రతినెలా జీతంతో పాటు ఇన్సెంటివ్ ఇవ్వాలన్నారు. ఎన్‌హెచ్‌ఎంలోని ఇతర ఉద్యోగులతో సమానంగా 23శాతం ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీఎంసీఏ జిల్లా సంయుక్త కార్యదర్శి అఖిల్, భార్గవ్, చక్రధర్‌తోపాటు నంద్యాల జిల్లా కమ్యూనిటీహెల్త్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

- కౌన్సిల్ మీట్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్, పలువురు కౌన్సిలర్ల చర్చ
- ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం


భూకబ్జాపై మాట్లాడుతున్న కౌన్సిలర్ సావిత్రమ్మ


ఉగ్రదాడిలో మరణించిన వారికి సంతాపం తెలుపుతున్న కౌన్సిలర్లు, అధికారులు

నంద్యాల టౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఆస్తులను ప్రతి ఒక్కరూ కాపాడాలని, ఆక్రమణలను అధికారులు తొలగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, పలువురు కౌన్సిలర్లు చర్చించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముందుగా ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం కౌన్సిల్ ప్రారంభించారు. సాయిబాబా నగర్ నుంచి రైల్వేస్టేషన్ వరకు రోడ్డు వెడల్పు చేయాలని ఛైర్‌పర్సన్ అజెండాలో పెట్టగా.. అది అంత రద్దీ ప్రదేశం, ఇప్పుడు అవసరం లేద ని కౌన్సిలర్ కృష్ణమోహన్ అభ్యంతరం తెలిపారు. వైఎస్ నగర్‌లోని మున్సిపాలిటీకి సంబంధించిన మూడెకరాల భూమిని కొందరు వ్యక్తులు రేకుల షెడ్డు వేసుకుని ఆక్రమించుకున్నారని 38వ వార్డు కౌన్సిలర్ సావిత్రమ్మ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లగా చైర్‌పర్సన్ వాటిని తొలగించాలని ఆదేశించారు. ప్రతాప్ థియేటర్‌వద్ద ఉన్న మున్సిపల్ స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని వైన్ షాప్ పక్కనే ఉండడంతో సిట్టింగ్ ఏర్పాటు చేశారని, తొలగించాలని కౌన్సిలర్ కలాం కోరారు. మార్కెట్‌లో దుకాణాలకు అద్దెలు ఒక్కొక్కరికి ఒక రకంగా ఉన్నాయని కో ఆప్షన్ మెంబర్ సలాముల్లా కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. వార్డుల్లో పారిశుధ్యంను మెరుగుపర్చాలని కౌన్సిలర్లు కోరారు. ఆక్రమణలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ ఎంఈకు, డీఈలకు సూచించారు. కమిషనర్ నిరంజన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాస్, అధికారులు పాల్గొన్నారు.

శాంతిరామ్ ఆసుపత్రి తనిఖీ


వైద్యులతో మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

నంద్యాల క్రైం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి బి.లీలా వెంకట శేషాద్రి లీగల్ సర్వీసెస్ యూనిట్ ఫర్ మనోన్య కమిటీ సభ్యులైన న్యాయవాది శేషసాయిబాబ, జీవన్‌కుమార్, పారాలీగల్ వలంటీర్లతో కలిసి బుధవారం పాణ్యం సమీపంలోని శాంతిరామ్ జనరల్ ఆస్పత్రిలోని మానసిక దివ్యాంగుల విభాగాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో మానసిక దివ్యాంగుల సంక్షేమం, వారికి న్యాయ సహాయం అందించడం కోసం ఎల్ఎస్‌యూఎం కమిటీ ఏర్పాటు చేశామన్నారు. అనంతరం వార్డులోని మానసిక దివ్యాంగులను కలిసి న్యాయపరమైన హక్కులను వారికి వివరించారు. వారికి ఆరోగ్య, సంరక్షణ, వారికి అందుతున్న ఆహార, వైద్య సదుపాయాలను అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో శాంతిరామ్ ఆస్పత్రి ప్రిన్సిపాల్ డా.వి.వసంత్ ఆర్ చవాన్, డా.మధుసూదన్‌రెడ్డి, సైక్రియాటిస్ట్ డా.పిఎస్ మూర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు


పాణ్యంలో ఆటో డ్రైవర్లకు, కూలీలకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

పాణ్యం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వాహనాల్లో పరిమితికి మించి ప్రయణిలను ఎక్కించుకోవద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పాణ్యం సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం మిరప కూలీలతో పరిమితికి మించి వెళ్తున్న ఆటోలను నిలిపివేశారు. ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ ఆటోలలో ఇర వై నుంచి 30 వరకు వ్యవసాయ కూలీలు ప్రయాణిస్తున్నారన్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు 18 వాహనాలు అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. లైసెన్స్, పొల్యూషన్, ఆర్సీ, బీమాలేని వాహనాలకు జరిమానా విధించారు. కూలీలకు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

'ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలి'


చెలిమిళ్లలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

పాములపాడు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలో లబ్ధిదారులు ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని మండల ప్రత్యేకాధికారి రాజు సూచించారు. ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈతో కలసి బుధవారం చెలిమిళ్ల, బానకచెర్ల గ్రామాలలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్దిదారులకు కడ్డీ, సిమెంట్, ఇస్తున్నామని, సకాలంలో బిల్లులు చెల్లిస్తామని తెలిపారు. అలాగే బానకచెర్ల, చెలిమిళ్ల గ్రామాలలోని సచివాలయాలను మండల ప్రత్యేక అధికారి రాజు, ఎంపీడీవో చంద్రశేఖర్ తని చేశారు. వారు మాట్లాడుతూ సర్వేలను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

నేడు న్యాయ అవగాహన సదస్సు

నంద్యాల క్రైం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మూడో అదనపు జిల్లా న్యాయాధికారి ఆదేశాల మేరకు నంద్యాల మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో మే డే సందర్భంగా గురువారం లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు నంద్యాల బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల పట్టణంలోని గాంధీచౌక్ హమాలీల కార్యాలయం దగ్గర ఉదయం 9:30గంటలకు ప్రారంభమయ్యే లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమంలో నంద్యాల న్యాయవాదులు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

కంచి పీఠాధిపతులకు జ్ఞాపికల అందజేత


మహానందీశ్వరుడి జ్ఞాపికను అందజేస్తున్న ఈవో శ్రీనివాసరెడ్డి, వేదపండితులు

మహానంది, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కంచి కామకోటి 71 వ పీఠాధిపతులుగా శిష్య స్వీకారం చేసిన సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామిజీకి, 70వ పీఠాధిపతి శంకర విజయేంద్ర మహా సరస్వతి స్వామిజీకి మహానందీశ్వర స్వామి వారి ప్రసాదాలతో పాటు స్వామి వారి జ్ఞాపికను బుధవారం ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఆలయ వేదపండితులు చండూరి రవిశంకర్ అవధాని, హనుమంత్‌శర్మ అందజేశారు. కంచి పీఠం శిష్య స్వీకారోత్సవంలో పాల్గొని వేడుకలను తిలకించారు. మహానంది క్షేత్రం తరఫున గౌరవ ప్రదంగా కంచి పీఠాధిపతులకు ప్రసాదాలను, మెమెంటోలను అందజేసినట్లు ఈవో చెప్పారు. ఏఈవో యర్రమల్ల మధు ఉన్నారు.

ప్రశాంతంగా పాలీసెట్

- 562 మంది గైర్హాజరు


పరీక్షకు హాజరైన విద్యార్థులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో 22 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పాలీసెట్ ప్రవేశపరీక్ష బుధవారం ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షకు జిల్లాలో 5,682 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 5120మంది హాజరు కాగా, 562 మంది గైర్హాజరైనట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రి న్సిపాల్, జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్‌ప్రసాద్ తెలిపారు. బనగానపల్లె, శ్రీశైలం, బేతంచర్ల పట్టణాల్లోని కళాశాల ల్లో సైతం పరీక్షలు నిర్వహించారన్నారు.

కూలిన భారీ వృక్షం


నంద్యాలలో కూలిన వేపచెట్టు

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని ఆంజనేయ కోదండరామస్వామి దేవస్దానంలోని వేపచెట్టు కూలిపోయింది. బుధవారం తెల్లవారుజామున 4గంటల ప్రాంతంలో వంద సంవత్సరాల వేప చెట్టు కూలినట్లు ఆలయ ఈవో వేణునాథరెడ్డి తెలిపారు. ఈ చెట్టు కూలడం తెల్లవారుజామున కూలిపోవడం వలన ఎటువంటి ప్రమాదం లేదు. అయితే ఆలయంలోని నవగ్రహమండపం మీద పడటంతో నవగ్రహ మండపం పాక్షికంగా దెబ్బతింది.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో అక్షయ తృతీయ సందర్భంగా చర్చిలో, మసీదులలో, దేవాలయాలల నందు బాల్యవివాహాల నిర్మూలనకు వ్యతిరేయంగా ప్రతిజ్ఞ చేయించారు. నంద్యాల జిల్లాలో సంబంధిత శాఖల అధికారులతో కలిసి హెడ్స్ సంస్థ బాల్య వివాహాల నిర్మూలన, చైల్డ్ లేబర్ చైల్డ్ అబ్యూస్ నిర్మూలనకు నిరంతరంగా పనిచేస్తుందని యాక్సెస్ టు జస్టిస్ ప్రోగ్రాం జిల్లా కోఆర్డినేటర్ రాజు, ప్రెసిడెంట్ కృష్ణ యాదవ్, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నవనంది క్లబ్ డిప్యూటీ గవర్నర్ బొగ్గరపు పుష్పలత సహకారంతో అక్షయ తృతీయ పురస్కరించు కొని బైర్మల్ వీధిలో దీపక్ లాడ్జి దగ్గర మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చార్టర్ గవర్నర్ ఆర్యన్ బింగుమళ్ల శ్యామ్‌సుందర్ గుప్తా, జిల్లా కేబినెట్ సెక్రటరీ ఆర్యన్ మలిపెద్ది నాగరాజు, శ్రీనివాస దత్తాత్రేయ, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు నాణ్యత పరిశీలన


రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

మిడుతూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మిడుతూరు నుంచి ఓర్వకల్లుకు వెళ్లే రోడ్డుపై నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డును బుధవారం ఆర్అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ చంద్రశేఖర్, ఈఈ కృష్ణా రెడ్డి, డీఈ వెంకటేశ్వర రెడ్డి పరిశీలించారు. రూ.2.5 కోట్ల నిధులతో నిర్మించిన రోడ్డును తనిఖీ చేశారు. వీరి వెంట ఆర్అండ్‌బీ ఈఈ సురేష్ బాబు, డీఈ ఫణిరాం, ఏఈ రుక్మిణి ఉన్నారు.

ఎక్సైజ్ దాడులు

నందికొట్కూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నీలిషికారి కాలనీలో ఎక్సైజ్‌శాఖ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సజ్జాని అనే వ్యక్తిని నుంచి 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు తన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ రామాంజనేయులు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్‌శాఖ ఎస్ఐలు జఫ్రుల్లా, భాష్యం శ్రీనివాసులు హెడ్ కానిస్టేబుల్ కృపవర కుమారి, శంకర్ నాయక్, కానిస్టేబుల్ శివన్న, మధుసూదన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలంటే కౌలు రైతులు పంటసాగుహక్కు పత్రం తప్పనిసరిగా కలిగి ఉండాలని, దరఖాస్తు చేసుకోవాలని ఏవో విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రైతులు 2025-26 ఏడాదికి ఎవరైతే పొలం కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నారో వారు తప్పనిసరిగా పంట సాగు హక్కు పత్రం కలిగి ఉండాలన్నారు. ఈ కౌలు గుర్తింపు కార్డులతోనే రైతు భరోసా, పంటల నమోదు, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, తదితర పథకాలు వర్తింపజేయడానికి వీలు కలుగుతుందన్నారు. ఈ సీసీ కార్డు కోసం కౌలు రైతులు కౌలుకు తీసుకున్న రైతుకు సంబంధించిన అగ్రిమెంట్, ఆధార్ కార్డు, ఒక ఫోటో, భూయజమాని 1బి తదితర జిరాక్స్‌లను ఆయా గ్రామాల రైతు సేవా కేంద్రాలలో వీఆర్వోలకు సమర్పించి పొందాలని సూచించారు.

నేటి నుంచి ఉచిత శిక్షణ శిబిరాలు


సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాహకులు

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కేఎస్‌ఎం మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో కళారాధన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు ఉచిత లలిత కళలు, క్రీడల వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కళారాధన నిర్వాహకులు తెలిపారు. బుధవారం స్థానిక కళారాధన కార్యాలయంలో శిక్షణాశిబిరాల నిర్వహణపై శిక్షకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కళారాధన అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మధుసూదన్‌రావు, డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ శిక్షణా శిబిరంలో శాస్త్రీయ నృత్యం, ఆధునిక నృత్యం, శాస్త్రీయ సంగీతం, లలిత సంగీతం, వాయిద్య సంగీతంలో గిటార్, కీ బోర్డు, మిమిక్రీ, వెంట్రిలాక్విజమ్, చిత్రలేఖనం, చక్కటి చేతివ్రాత, హస్తకళలు, సోప్ కార్వింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, పద్యపఠనం, సంస్కృత శ్లోకాలు, కవితాగానం, కవితారచన, చదరంగం, కరాటే, తైక్వాండో, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలలో 22 మంది శిక్షకులతో శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. మే 31న ముగింపు ఉత్సవంలో బాల, బాలికల ప్రదర్శనలు రూపొందించాలని సూచించారు. గత 23సంవత్సరాలుగా కళాసాధన పేరిట ఉచిత వేసవి శిక్షణాశిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో క్యాంప్ కో ఆర్డినేటర్ కత్తిరంగనాథ్, శిక్షకులు గణేష్, లలితా సరస్వతి, దామోదర్, సమీర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

నంద్యాల టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎన్జీవో కాలనీలో ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ విద్యుదాఘాతానికి గురైై నేత్ర (24) అనే విద్యార్థిని మృతి చెందినట్లు బుధవారం టూటౌన్ సీఐ ఇస్మాయిల్ తెలిపారు. వివరాలివీ.. మదనపల్లెకు చెందిన నేత్ర గత కొన్ని ఏళ్లుగా నంద్యాలలో బ్యాంకు కోచింగ్ శిక్షణ తీసుకుంటోంది. ఈనెల 22న దుస్తులు ఆరేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు షాక్ తగిలి పడిపోయింది. తోటు విద్యార్థులను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అదే రోజు మెరుగైన చికిత్స కోసం కర్నూలు తీసుకెళ్లారు. అయితే 26వ తేదిన మరణించిందని సీఐ తెలిపారు.

ప్రభుత్వ స్థలంలో పశువుల పాక


అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన స్థలంలో ఏర్పాటు చేసిన పశువుల పాక

మహానంది, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరం గ్రామంలోని అంగన్‌వాడీ-3 కేంద్రం అద్దె భవనంలో కొనసాగుతుండడంతో గత ప్రభుత్వంలో గ్రామ పంచాయతీకి చెందిన సుంకులమ్మ ఆలయం సమీపంలో 4 సెంట్ల స్థలాన్ని అధికారులు అంగన్‌వాడీ కేంద్రం కోసం కేటాయించారు. నాడు-నేడు నిధులు దాదాపు రూ.13.50 లక్షలు కేటాయించారు. ఇందులో మూడు సెంట్లలో అంగన్‌వాడీ కేంద్రం భవనం, మరో సెంటు స్థలంలో పిల్లల కోసం కొంత క్రీడా స్థలం, ప్రహరీ గోడ నిర్మించాలని ఉంది. అయితే ఖాళీ స్థలంలో పశువుల పాక ఏర్పాటు చేశారు. వైసీపీ నాయకుల అండతో ఏకంగా తాత్కాలిక షెడ్డు వేశారని, తొలగించడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. పూర్తి సాయిలో నిధులు మంజూరు కాక పోవడంతో నిర్మాణం అర్ధాతరంగా ఆగిపోయింది.

నోటీసులు ఇచ్చి తొలగిస్తాం

గోపవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించిన ప్రభుత్వ స్థలంలో పశువుల పా ఏర్పాటు చేయడంపై ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. నోటీసులు పంపించి తొలగించేలా చర్యలు తీసుకుంటాం. వారం రోజుల్లో పోలీసుల సమక్షంలో ఆక్రమణలను తొలగిస్తాం. ప్రహరీ నిర్మించేలా చర్యలు తీసుకుంటాం.
- సుహాసిని, గ్రామ పంచాయతీ కార్యదర్శి

సింహాచలం ఘటన దురదృష్టకరం

- మంత్రి బీసీ దిగ్భ్రాంతి



మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సింహాచలం దేవస్థానంలో చందనోత్సవం సందర్భంగా జరిగిన దుర్ఘటనలో ఏడు మంది భక్తులు మృతి చెందడంపై దురదృష్టకరమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. మృతుల కుటుంబీకులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

సీహెచ్‌వోలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న విలేజ్ క్లినిక్ హెల్త్ సిబ్బంది

బనగానపల్లె, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ డిమాండ్ చేశారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లో కమ్యూనిటీ హెల్త్ అధికారులుగా పని చేస్తున్న సిబ్బంది స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కమ్యూనిటీ హెల్త్ అధికారులుగా పనిచేస్తున్నా జీతభత్యాల విషయంలో ఇబ్బందులు పడుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా జనరల్‌సెక్రటరీ గురుప్రసాద్, కోఆర్డినేటర్ సురేశ్‌బాబు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు వినోద్‌కుమార్, సబ్ ట్రెజరర్ హారిక పాల్గొన్నారు.

చౌడేశ్వరి మాత ఆలయాభివృద్ధికి వితరణ

బనగానపల్లె, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడేశ్వరీ మాత ఆలయాభివృద్ధికి నంద్యాల పట్టణానికి చెందిన గంగిశెట్టి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు రూ.35వేలు బుధవారం ఆలయాభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి భక్తులు విరాళాలు అందించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పూజారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జమాతె ఇస్లామి హింద్ అధ్యక్షుడిగా గౌస్ బాషా

బనగానపల్లె, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె జమాతే ఇస్లామిహింద్ నూతన అధ్యక్షుడిగా గౌస్‌బాషా బుధవారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాజీ అధ్యక్షుడు ఆలీబేగ్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ కార్యకర్తల సహకారంతో సమాజ సేవచేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు షబ్బీర్‌హుసేన్, రిజ్వాన్‌ఖాన్, షబ్బీర్‌బాషా, మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను చదివించాలి: ఎంపీడీవో

కోవెలకుంట్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు ఆడపిల్లల చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో వరప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక పొదుపు భవనంలో కిశోర వికాసం కార్యక్రమాన్ని ఎంపీడీవో అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని శక్తి టీం వారు బిలాల్ శక్తియాప్ గురించి వివరించారు. ఈ సమ్మర్ కాంపెయిన్‌లో అంగన్‌వాడీ టీచర్లు, మహిళా పోలీసులు, పొదుపు వీఏవోలు నిర్వహించవలసిన విధుల గురించి ఐసీడీఎస్ కౌన్సిలరు సునీల్‌కుమార్ చక్కగా వివరించారు.

ప్రశాంతంగా పాలీసెట్

- 71 మంది విద్యార్థులు గైర్హాజరు

బనగానపల్లె, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం నిర్వహించిన పాలీసెట్-25 పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు వాసవీ పాలిటెక్నిక్ కళాశాల సూపరింటెండెంట్ రమణారెడ్డి తెలిపారు. 891 మంది పరీక్షలు రాయగా ఇందులో 71 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. బనగానపల్లె పట్టణంలో వాసవీపాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ ఉన్నతపాఠశాల శ్రీసాయిసిద్దార్థ జూనియర్ కళాశాల, కంకరగుర్రెడ్డి కళాశాల పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు.

వేసవి శిక్షణా తరగతులను వినియోగించుకోవాలి

చాగలమర్రి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణా శిబిరాన్ని వినియోగించుకోవాలని తల్లిదండ్రులను గ్రంథాలయ అధికారి రామచంద్రుడు కోరారు. బుధవారం గ్రంథాలయంలో విద్యార్థులతో అభ్యాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతి రోజు పుస్తకాలను చదివించడం, డ్రాయింగ్, చెస్, క్యారమ్స్, క్విజ్ తదితర నైపుణ్యాలపై శిక్షణ ఉంటుందని అన్నారు. వేసవి శిక్షణా తరగతులను జూన్ 6 వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రసాద్, కాంతారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: జిల్లా గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బేతంచెర్ల శాఖ గ్రంథాలయాల్లో విద్యార్థులకు వేసవిశిక్షణ తరగతుల్లో భాగంగా 3వ రోజు డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీషు, కంప్యూటర్ శిక్షణను ఉపాధ్యాయులు బుధవారం ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మధుశేఖర్, ఉపాధ్యాయురాలు కృష్ణ ప్రియ, జాకీర్ హుశేన్, 25 మంది విద్యారుథలు, పాఠకులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

- హౌసింగ్ పీడీ శ్రీహరిగోపాల్

సంజామల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ శ్రీహరి గోపాల్ లబ్ధిదారులను సూచించారు. బుధవారం మండలంలోని పేరుసోమల, ఆర్.లింగందిన్నె గ్రామంలో నిర్మిస్తున్న ఎన్టీఆర్ గృహాలను ఆయన పరిశీలించారు. రూఫ్, ఆర్‌సీ లెవెల్‌లో ఉన్న లబ్ధిదారులు మే 30లోపు నిర్మాణాలను పూర్తిచేస్తే అదనపు బిల్లు వర్తిస్తుందన్నారు. బిల్లులు చెల్లింపులో జాప్యం లేకుండా వేగవంతంగా బిల్లులను అందజేస్తామన్నారు. కొత్తగా గృహాలను మంజూరు చేస్తామని లబ్ధిదారులకు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ బాలచంద్రుడు, వర్క్ ఇన్స్‌పెక్టర్ శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి కోసం బోరు ఏర్పాటు

రుద్రవరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లవాగుపల్లె గ్రామంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సహకారంతో తాగునీటి సౌకర్యం కోసం బోరు ఏర్పాటుచేసినట్లు టీడీపీ నాయకులు పార్థసారథిరెడ్డి బుధవారం తెలిపారు. నీటి కోసం ఇబ్బంది ఉండేదని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆమె వెంటనే స్పందించి కొత్త బోరు వేయడంతో నీరు పుష్కలంగా ఉంది.

సమ్మర్ క్యాంపును సద్వినియోగించుకోవాలి

డోన్ టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సమ్మర్ క్యాంపును క్రీడాకారులు వినియోగించుకోవాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ కోరారు. బుధవారం పట్టణంలోని బుగ్గన శేషారెడ్డి మెమోరియల్ ఇండోర్ స్టేడియంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. పది సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల బాలబాలికలకు సమ్మర్ క్యాంపు బ్యాడ్మింటన్, షటిల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు కౌన్సిలర్ నాగేంద్ర 8985702633ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో కౌన్సిలర్ నాగేంద్ర, క్రీడాకారులు పాల్గొన్నారు.

కష్టాల కడలిలో శ్రమజీవులు

కానరాని కార్మిక సంక్షేమం

- ఉమ్మడి జిల్లాలో రెండు లక్షలకు పైగా గని కార్మికులు
- అనునిత్యం ప్రమాదాలు
- కరువైన కనీస సౌకర్యాలు
- గనుల్లో సమాధి అవుతున్న కార్మిక చట్టాలు
- నేడు కార్మిక దినోత్సవం



కొలిమిగుండ్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కష్టాల కడలిలో కష్టజీవులు(కార్మికులు) కొట్టుమిట్టాడుతున్నారు. జానెడు పొట్ట కోసం పడరాని పాట్లు పడుతున్నారు. యజమానుల సంక్షేమానికి నిరంతరం శ్రమించే వారికి ఆపదలు సంభవిస్తే ఆదుకునేవారే కరువయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లక్షలాది మంది గని కార్మికులుగా జీవనం సాగిస్తున్నా కార్మిక చట్టాల గురించి వారికి ఇసుమంతయినా తెలియని వైనం. ఎండనక, వాననక అహర్నిశలు శ్రమిస్తున్న గని కార్మికులను ఇటు యాజమాన్యాలు గానీ.. అటు ప్రభుత్వాలు గానీ సంక్షేమం కోసం చర్యలు చేపట్టని దుస్థితి. నేడు కార్మిక దినోత్సవం (మేడే) సందర్భంగా వారి స్థితిగతులపై కథనం..

ఉమ్మడి జిల్లాలోనే..

ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా బనగానపల్లె ప్రాంతంలోని కొలిమిగుండ్ల, అవుకు, బనగానపల్లె, బేతంచర్ల, డోన్ ప్రాంతాల్లో నాపరాయి, రంగురాయి నిక్షేపాలు విస్తారంగా నెలకొని ఉన్నాయి. ఇందులో సుమారు 2లక్షల మంది గని కార్మికులు నాపరాయి పరిశ్రమ ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. ఒక్క కొలిమిగుండ్ల మండలంలోనే సుమారు 30వేల మంది నాపరాయి గనుల్లో కార్మికులుగా బతుకుదెరువు సాగిస్తున్నారు. కార్మికుల నిరంతర శ్రమతో గనుల యజమానులు కోట్లాది రూపాయలు లాభాలు అర్జించి, ధనికులుగా మారుతున్నారు. కార్మికుల జీవితాల్లో మాత్రం వెలుగులు కానరావడం లేదు. నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు.



నాపరాళ్ల గనిలో పని చేస్తున్న కార్మికులు (ఫైల్)

కనుచూపు మేర కానరాని..

కార్మికులకు గనుల(మైనింగ్) ప్రాంతాల్లో కల్పించాల్సిన కనీస సౌకర్యాలు కనుచూపు మేర కానరావడంలేదు. తాగునీరు, నీడ, ప్రథమ చికిత్సా ఏర్పాట్లు, లోతైన గుంతల వద్ద తీసుకోవాల్సిన చర్యలు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. నాపరాతి గనుల్లో ప్రమాదాలకు గురై వందలాది మంది కార్మికులు మృత్యువాత పడటంతో పాటు క్షతగాత్రులుగా మిగిలిపోతున్నారు. ప్రమాదాలు సంభవించి అంగవైకల్యం కలిగిన కార్మికులకు అండగా ఉండాల్సిన గని యజమాన్యాలు, ప్రమాదం జరిగినప్పుడు ఆసుపత్రి ఖర్చులకు అరకొరగా ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. గనుల్లో కార్మిక చట్టాల అమలు అయితే ఊసే లేదు.

వివరాలను జాగ్రత్తగా నమోదు చేయండి



యల్లావత్తుల సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ విష్ణుచరణ్

రుద్రవరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : భూరీసర్వే రికార్డుల వివరాలను ఆన్‌లైన్‌లో జాగ్రత్తగా నమోదు చేయాలని జేసీ విష్ణుచరణ్ ఆదేశించారు. బుధవారం మండలంలోని యల్లావత్తుల సచివాలయాన్ని జేసీ తనిఖీ చేశారు. రెండో విడత భూరీసర్వే జరిగిన బీరవోలు గ్రామం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎనిమిది గ్రామాల్లో భూరీసర్వే జరిగిందన్నారు. రెండో విడత పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలో మండలానికి ఓ గ్రామం ఎంపిక చేశామన్నారు. అదేవిధంగా రెండో విడతగా కొండమాయపల్లె, నాగులవరం గ్రామాలను భూరీసర్వే కింద ఎంపిక చేశామన్నారు. గ్రామాల్లో బౌండరీలు నిర్ధారించారన్నారు. ఒక్కో బ్లాక్‌కు 400 ఎకరాల చొప్పున సిబ్బంది విభజిస్తున్నారన్నారు. ఆన్‌లైన్‌లో సర్వేనెంబర్ల వారీగా నమోదు చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దారు మల్లిఖార్జునరావు, సర్వే ఇన్స్‌పెక్టరు రామ్మోహన్, డిప్యూటీ సర్వే ఇన్స్‌పెక్టరు చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

గాలి వాన విధ్వంసం

- నేలవాలిన వరి, మొక్కజొన్న పంట
- అవుకులో పీర్ల చావిడి వద్ద కూలిన భారీ మర్రిచెట్టు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం



భారీ గాలులకు నేలకూలిన భారీ వృక్షం

అవుకు/ బనగానపల్లె, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అవుకు, బనగానపల్లె పట్టణంలో గాలి వాన విధ్వంసం సృష్టించింది. బుధవారం సాయంత్రం 5 గంటలకు ఉరుములు మెరుపు, భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. అవుకు మండలంలో 500 ఎకరాల్లో వరి, 100 ఎ కరాల్లో మొక్కజొన్న నేల వాలినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. అవుకులోని తేరు వీధిలో పీర్లచావిడి వద్ద భారీ మర్రిచెట్టు కూలిపోయింది. ఈవృక్షం చల్లా అమరనాథరెడ్డి ఇంటి పై పడడంతో కొంతభాగం కొంతమేరకు దెబ్బతింది. ఇక్కడ ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్‌కు అంతరాయం కలిగింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మండపం వీధిలో, జమ్ములమ్మ గుడి సమీపంలో భారీ చెట్లు నేల కొరగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మండలంలోని సింగనపల్లె భారీ ఉరుములు, మెరుపులతో పెట్నికోటకు చెందిన ప్రసాద్ అను వ్యక్తికి చెందిన 5 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. సుమారు రూ.60వేలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. బనగానపల్లె మండలంలోని బనగానపల్లె - గుత్తి రహదారిలో సాదుకొట్టం గ్రామంలో భారీ వేపచెట్టు కూలిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఎర్రగుడి, పలుకూరు, బీరవోలు, రామతీర్థం గ్రామాల్లో సుమారు 60కి పైగా విద్యుత్ స్తంభాలు నేల కూలాయి.

హరినగరంలో ట్రాక్టరుపై పడ్డ వేపచెట్టు

రుద్రవరం: మండలంలోని హరినగరం గ్రామంలో ట్రాక్టరుపై వేపచెట్టు పడింది. ఎర్రన్న అనే రైతుకు చెందిన ట్రాక్టరు దెబ్బతింది. కొండమాయపల్లె, వెలగలపల్లె, ఆర్.కొత్తూరు, రుద్రవరం, నరసాపురం, ఆలమూరు ఇంకా పలు గ్రామాల పరిధిలో వరి ధాన్యం మొక్కజొన్నలు తడిచిపోయాయి.

విరిగిపడ్డ విద్యుత్ స్తంభం

కొలిమిగుండ్ల: స్థానిక నెల్లూరు-ముంబై హైవేపై ట్రాన్స్‌ఫార్మర్‌తో కూడిన విద్యుత్ స్తంభం బుధవారం విరిగిపడింది. ఆసమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు గంట పాటు ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

చాగలమర్రిలో మోస్తరు వర్షం

చాగలమర్రి: మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తారు వర్షం బుధవారం రాత్రి కురిసింది. ఈ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముత్యాలపాడు బస్టాండులో వర్షపు నీరు నిలిచి కుంటలా మారింది. సర్వీసు రహదారుల్లో ఆరబెట్టిన మొక్కజొన్న ధాన్యం తడిచి దెబ్బతింది. చిన్నవంగలి, చింతలచెరువు, కొలుములపేట, ముత్యాలపాడు తదితర గ్రామాల్లో పొలాల్లో కోతకోసి ఉంచిన నువ్వు పంట తడిచింది.



కొలిమిగుండ్లలో హైవేలో పడిపోయిన విద్యుత్ స్తంభం



రుద్రవరంలో వర్షానికి తడుస్తున్న ధాన్యం

వీరాయపల్లెలో ఘనంగా పెద్దమ్మ దేవర

బేతంచెర్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాయపల్లెలో పెద్దమ్మ దేవర అత్యంత వైభవంగా బుధవారం నిర్వహించారు. పెద్దమ్మకు జంతుబలినిచ్చారు. ఉత్సవాలకు వైసీపీ మండల ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, బుగ్గన కుమారరెడ్డి, ముద్దవరం సర్పంచ్ మారెప్ప, గ్రామ నాయకులు లక్ష్మికాంతరెడ్డి పిలుపుమేరకు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. 15 ఏళ్ల క్రితం గ్రామంలో పెద్దమ్మ దేవర నిర్వహించామన్నారు. మరలా ప్రస్తుతం ఈ కార్యక్రమం ఇంత ఘనంగా నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ వెంకటేశ్వరరావు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తిరుమలేష్ రెడ్డి, పిట్టల జాకీర్, మనోహర్, చిరంజీవి, మౌలాలి, బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కిట్ స్టాక్ పాయింట్ తనిఖీ

బేతంచెర్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠ శాల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసే యూనిఫామ్స్ సర్వేపల్లి రాధాకృష్ణ కిట్ల స్టాక్ పాయింట్‌ను నంద్యాల జిల్లా ఏసీపీ ప్రేమంత కుమార్ బుధవారం తనిఖీ చేశారు. యూనిఫామ్ నాణ్యతను పరిశీలించి ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఏఎంవో లలిత స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. వీరితో పాటు మండల విద్యాధికారులు సోమశేఖర్, అబ్రహాం పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ సబ్ జైలు తనిఖీ



సబ్ జైల్లో ఖైదీల భోజనాన్ని పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి లీలా వెంకటశేషాద్రి

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉప కారాగారాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి లీలా వెంకటశేషాద్రి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులో ఉన్న ఖైదీలతో సమావేశం నిర్వహించారు. సబ్ జైల్లో ఖైదీలకు కావాల్సిన కనీస సౌకర్యాలపై వారిని అడిగి తెలుసుకున్నారు. వైద్య సదుపాయాలు, భోజన వసతులు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఆర్థిక స్థోమత లేక న్యాయవాదిని నియమించుకో లేని వారికి న్యాయసేవాధికా సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొం దవచ్చన్నారు. ఏవైనా న్యాయపరమైన సమస్యలు వస్తే జైలులో ఉన్న న్యాయ సేవాధికార సంస్థ ద్వారా సహాయం పొందవచ్చన్నారు. ఆళ్లగడ్డ సబ్‌జైల్లో పరిమితికి మించి ఖైదీలున్నారని జైలు సూపరిండెంట్ శల్వంత్‌కు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్లు మోహన్, షహీనాబేగం, మెడికల్ ఆఫీసర్ నాగమస్తాన్ పాల్గొన్నారు.

సాగులో భూసార పరీక్షలే కీలకం: ఏవో

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : రైతుల పంటల సాగులో భూసార పరీక్షలే అత్యంత కీలకమని మండల వ్యవసాయాధికారి భూమా జ్యోతి వెల్లడించారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో రైతుల పొలాల్లో భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలు సేకరిస్తున్నామన్నారు. ఆయా గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల సిబ్బంది ఆధ్వర్యంలో మట్టి నమూనాలు సేకరించి, భూసార పరీక్షలకు పంపనున్నట్లు తెలిపారు. ఫలితాల ఆధారంగా రైతులు పంటలు సాగు చేయడం ద్వారా అనేక ఉపయోగాలు ఉంటాయని ఆమె సూచించారు.

బోరు బావులకు మరమ్మతులు

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా బోరు బావులకు మరమ్మతులు చేపడుతున్నట్లు సర్పంచ్ జినుగు శివరాముడు బుధవారం తెలిపారు. బోర్లు మరమ్మతులకు గురి కావడంతో, తాగునీటి సమస్య ఏర్పడకుండా వెంటనే మరమ్మతు పనులు చేపట్టామన్నారు.

సర్వే 82 శాతం పూర్తి



సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

చాగలమర్రి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీడీసీడీ సర్వే 82శాతం పూర్తి చేశామని మండల ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ రామలింగారెడ్డి అన్నారు. బుధవారం చాగలమర్రి గ్రామంలోని 20వ వార్డులో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. వివిధ వ్యాధులపై అవగాహన కల్పించారు. మహిళల ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పుట్టుకతో వచ్చే వ్యాధుల గురించి వివరించారు. మండలంలోని తొమ్మిది సచివాలయాల పరిధిలో సర్వే వేగవంతం చేశామన్నారు. 10,342 కుటుంబాలు ఉండగా 8,471 కుటుంబాలను సర్వే చేశామని తెలిపారు. 25,636మంది వివరాలను యాప్‌లో నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైభవంగా దస్తగిరిస్వామి గంధోత్సవం

చాగలమర్రి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిగనూరు గ్రామంలో దస్తగిరిస్వామి ఉరుసు సందర్భంగా బుధవారం గంధోత్సవాన్ని నిర్వహించారు. గంధాన్ని ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకెళ్లారు. టీడీపీ నాయకులు శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో దస్తగిరిస్వామికి ఫాతెహాలు చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే చాగలమర్రి గ్రామంలోని బందేషావలి దర్గా వద్ద గంధం సమర్పించి ఫాతెహాలు చేశారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పండ్ల తోటలకు వంద శాతం రాయితీ

చాగలమర్రి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల సాగుకు వందశాతం రాయితీని ప్రభుత్వం అందిస్తోందని ఏపీవో ఖాసీం తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో టీఏ, ఎఫ్ఏల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధిహామీ పథకం ద్వారా హార్టికల్చర్‌లో మామిడి, నిమ్మ, కొబ్బరి, అల్లనేరేడు తదితర 18 రకాల పండ్ల తోటలు సాగు చేసుకునే లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. కూరగాయాల సాగు, రాయితీ గురించి రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఆదిశంకరాచార్య జయంతి

చాగలమర్రి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామం లోని పాత శివాలయంలో శుక్రవారం ఆదిశంకరాచార్య జయంతిని నిర్వహించనున్నట్లు అభినవ శంకరానందస్వామి బుధవారం తెలిపారు. లలిత సహస్రనామం, భగవద్గీత పారాయణం, పంచగురు పాదుక పూజ, శాంతానంద సరస్వతి స్వాములచే ప్రత్యేక ఉపన్యాసాలు, భజన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

శ్రీశ్రీకి ఘననివాళి

డోన్ రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) జయంతిని ఘనంగా నిర్వహించారు. శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ మహాప్రస్థానం రచయిత శ్రీశ్రీ చేసిన సేవలు మరువరానివి అన్నారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు దేవేంద్రప్పతో పాటు సీనియర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్ షర్మిల గృహ నిర్బంధం దారుణం

- కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి

డోన్ రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను హౌస్ అరెస్టు చేయడం దారుణమని డోన్ నియోజకవర్గ సమన్వయ కర్త గార్లపాటి మద్దిలేటి అన్నారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్దండరాయునిపాలెంలో పర్యటనకు సిద్ధమవుతున్న వైఎస్ షర్మిలపై పోలీసులు ఆంక్షలు విధించడం సమంజసం కాదన్నారు. ప్రజా ఉద్యమాలను అణిచివేయాలని చూస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మల్లెంపల్లె జనార్దన్, పఠాన్ హుశేన్, రామాంజనేయులు, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

డోన్ రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చెర్వు గ్రామంలో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి కర్ణాటక మద్యం పట్టుకున్నారు. కొచ్చెర్వు గ్రామానికి చెందిన మేకల లక్ష్మన్న, శ్రీనివాసులు అనే వ్యక్తులపై కేసు నమోదు చేసి వారి నుంచి 192 (90ఎంఎల్) అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. దాడులో ఎక్సైజ్ ఎస్ఐలు సోమశేఖర్‌రావు, దౌలత్‌ఖాన్, హెడ్ కానిస్టేబుల్లు సుదాకర్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

బేతంచెర్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నగర పంచాయతీ పరిధిలోని బుగ్గానిపల్లెలో బుధవారం చోటు చేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన జింక సుధాకర్ (35) కుటుంబ పరిస్థితులు బాగోలేక పోవడం గొడవలు జరిగేవి. దాంతో రాత్రి తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య రజిని, నాలుగేళ్ల కుమారుడు, మూడు నెలల కూతురు సంతానం.మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

- సీతారామాపురంలో..

మండలంలోని సీతారామాపురం గ్రామానికి చెందిన బోయ బాల ఉశేని(32)అనే వ్యక్తి గతరాత్రి తన ఇంట్లో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతడికి ఇద్దరు భార్యలు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

బాల్య వివాహాల నివారణకు కృషి చేయాలి

బేతంచెర్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సమాజంలో బాలికలు ఎదుర్కొనే ఇబ్బందులు, బాల్య వివాహాల నివారణ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిప్పమ్మ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో కిశోర వికాసం వేసవి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ ప్రకాష్‌బాబు, ఎంపీడీవో ఫజుల్ రెహిమాన్, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగులకు పదోన్నతులు

డోన్ టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): డోన్ మున్సిపల్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ విభాగంలో మేనేజర్‌గా పని చేస్తున్న బి.ఆరీఫ్‌కు పదోన్నతి లభించింది. ధర్మవరం పురపాలక సంఘానికి బదిలీపై వెళ్లారు. అలాగే డోన్ రెవెన్యూ విభాగం కేటగిరి-3లో రెవెన్యూ ఆఫీసర్‌గా పని చేస్తున్న ఎస్.వెంకటరెడ్డి, నంద్యాల పురపా లక సంఘం కేటగిరి-2కి ప్రమోషన్‌పై బదిలీ అయ్యారు.